PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 304 | విజయవాడ, శుక్రవారం 6 జూన్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 6 June 2025 | Rs

గాజాలో కాల్పులు విరమించండి

- ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానం
- ఏకపక్షంగా ఆరోసారి వీటో చేసిన అమెరికా

7

యువ క్రికెటర్లకు సదవకాశం

- ఇంగ్లండ్‌కు బయల్దేరిన టీమిండియా

ముంబయి: సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టెస్ట్‌లకు గుడ్‌బై చెప్పిన నేపథ్యంలో యువ క్రికెటర్లతో కూడిన భారతజట్టు గురువారం ఇంగ్లండ్ పర్యటనకు బయల్దేరించింది. ఈ పర్యటను బయల్దేరి వెళ్లే ముందు ఏర్పాటు చేసిన ప్రెస్ కాన్ఫరెన్స్‌కు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పర్యటన యువ క్రికెటర్లు తమ సత్తాను నిరూపించుకొనేందుకు దక్కిన ఒక సదవకాశంగా పేర్కొన్నారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ హోదాలో తొలిసారి మీడియా సమావేశానికి హాజరుకాగా.. విదేశీ పర్యటనకు వెళ్లే భారతజట్టుకు పూర్తిస్థాయి కెప్టెన్‌గా మొదటిసారి వ్యవహరించనున్నాడు. గత నెలలో రోహిత్, కోహ్లి టెస్ట్‌లకు గుడ్‌బై చెప్పడం, 2025-27 డబ్ల్యుటిసి ఛాంపియన్‌షిప్ సర్కిల్ ఈ సిరీస్‌నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా ఇరుజట్లకు ఈ సిరీస్ కీలకం మారింది. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో ఈనెల 20న లీడ్స్ వేదికగా భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది.

మామిడి, పొగాకు, కోకో పంటల కొనుగోళ్లకు రూ.550 కోట్లు

నేటినుండే ప్రక్రియ ప్రారంభం • ధరల స్థిరీకరణ నిధి ద్వారా చర్యలు • సమీక్షలో సిఎం ఆదేశం

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

రైతుల వద్ద మిగిలిపోయిన మామిడి, పొగాకు, కోకో పంటలను కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ధరల స్థిరీకరణ నిధి ద్వారా ఈ మేరకు చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్ల కోసం 550 కోట్ల రూపాయలను కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు ఆదేశించారు. గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో సిఎం ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సమీక్ష అనంతరం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద మిగిలిపోయిన నల్లబర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని సిఎం ఆదేశించినట్లు చెప్పారు. దీనికోసం 350 కోట్ల రూపాయలు ఖర్చు అయినా , ఆ మొత్తాన్ని భరించాలని సిఎం నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఏడు మార్కెట్ యార్డుల ద్వారా శుక్రవారం నుండే కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం కానుందని మంత్రి చెప్పారు. ఈ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. మామిడి రైతులు నష్టపోకుండా కిలోకు 12 రూపాయలు చెల్లించనున్నట్లు మంత్రి చెప్పారు. దీనిలో 8 రూపాయలు ప్రాసెసింగ్ కంపెనీలు చెల్లిస్తాయని. మిగిలిన 4 రూపాయలను ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇలా 150 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ రైతుల నుండి దాదాపు ఐదన్నర లక్షల టన్నుల మామిడిని కొనుగోలు చేయాలని మిగతా 2లో



మొక్క నాటుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

చెట్లు నరికితే శిక్షలు

- ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

2



మీడియాతో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు చిత్రంలో కె.లోకనాథం

మోడీ మెప్పు కోసమే

- **కార్మిక రూల్స్ మార్పుపై వి.శ్రీనివాసరావు**

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాని మోడీ మెప్పు కోసమే రాష్ట్రంలో కార్మిక రూల్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్చారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మూడు రోజులపాటు ఢిల్లీలోని హరి కిషన్ సింగ్ సుర్జిత్ భవన్‌లో జరిగిన సిపిఎం కేంద్ర కమిటీ సమావేశాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు కె.లోకనాథంతో కలిసి వి.శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధా నాలు, దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలను కేంద్రకమిటీలో చర్చించినట్లు ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా జూన్ 10 నుంచి, 20 వరకు 10 రోజుల పాటు మత విద్వేషాలకు వ్యతిరేకంగా మత సామరస్యాన్ని కాపాడేందుకు శాంతి యాత్రలు చేపట్టాలని కేంద్ర కమిటీ సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై క్షేత్రస్థాయి ఆందోళనలు ఉధృతం చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలిపారు.

పనిగంటల పెంపు దుర్మార్గం

రాష్ట్రంలో పని గంటలను ఎనిమిది నుంచి 12 గంటలకు పెంచుతూ ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు శ్రీనివాసరావు చెప్పారు. 'పని గంటలను పెంచడం చాలా దారుణం, దుర్మార్గం' అని ఆయన వ్యాఖ్యానించారు. సాంకేతికత పెరుగుతున్న నేపథ్యంలో పని గంటలు తగ్గించాల్సి ఉందని, కాని దానికి భిన్నంగా పని గంటలు పెంచారని ఆయన విమర్శించారు. పని గంటలు తగ్గిస్తే ఎక్కువ మందికి ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. ఎక్కువ మందికి ఉద్యోగాలు వస్తే కొనుగోలు శక్తి పెరిగి, ఆర్థిక వ్యవస్థ పరుగులు తీస్తుందన్నారు. కొత్తవారికి ఉద్యోగాలు రాకుండా ఇప్పుడున్న వారిపై భారం పెంచారని విమ ర్శించారు. పని గంటలను ఎనిమిది నుంచి 12 గంటలకు పెంచారని, కానీ జీతాలు మాత్రం ఒక్క రూపాయి కూడా పెంచలేదని దుయ్యబట్టారు ధరల పెరుగుదలతో అప్పుల పాలై ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని చెప్పారు. మోడీ సర్కార్ తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా జులై 9న దేశవ్యాప్తంగా కార్మికులు సమ్మెకు సిద్ధపడు తుంటే, ఆ లేబర్ కోడ్స్ విధి విధానాలు రూపొందించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అమానవీయంగా పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచిందన్నారు. కార్మికవర్గం దీన్ని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం లేబర్ కోడ్స్, రూల్స్ ను ఉపసంహరిం చుకుని, కార్మిక చట్టాలను పునరుద్ధరిస్తేనే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు.

విశాఖ స్టీల్‌పై ...

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో 4,500 మంది కార్మికులను తొలగించారని, కార్మికులు సమ్మె చేస్తే ప్రభుత్వం బెదిరించిందని సమ్మెపై అణచివేత ప్రదర్శించిందని విమర్శించారు. దాదాపు 3,000 మందిని ఇళ్లకు పంపించారని, మరో 1,500 మంది కార్మికులను పంపించేందుకు సిద్ధపడుతున్నారని విమర్శించారు. రూ.14,400 కోట్ల ప్యాకేజీ మోసపూరితమని, అందులో కేవలం రూ.1,800 కోట్లు మాత్రమే స్టీల్ ప్లాంట్ ఉత్పత్తికి ఉపయోగించారని అన్నారు. మిగిలిన మొత్తం పన్నులు, జిఎస్‌టి పేరుతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుందని, బ్యాంక్ అప్పులకు జమ చేసుకుందని విమర్శించారు. ప్యాకేజీ పేరుతో కార్మికులను మోసం చేస్తూ రాష్ట్ర ప్రజలను తప్పుదోవపట్టిస్తు న్నారని అన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు లేవని, పోర్టు లేదని, కాని ఇంకా ప్రారంభం కాని అర్సెల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కు గనులు కోసం లాబీ చేస్తున్నారని, పోర్టు కేటాయించారని విమర్శిం చారు. కార్మికులను మోసం చేసే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మత విద్వేషాలపై....

ప్రశాంతమైన రాష్ట్రంలో మత విద్వేషాలను రెచ్చగొట్టడం, మత కల్లోలాలను సృష్టించడానికి ఆర్‌ఎస్‌ఎస్, విశ్వ హిందూ పరిషత్ వంటి సంస్థలు చేస్తున్న ప్రయత్నాలకు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లాంటి వారు తోడవుతున్నారని విమర్శించారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అందరూ కలిసి ఐక్యంగా ఎదుర్కోవాల్సిన ఉగ్రవాదానికి మతం రంగు పులమడం దారుణమన్నారు. పవన్ కళ్యాణ్ లాంటి వారు ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలతో జత కలిసి ముస్లింలంతా ఉగ్రవాదులేనని, వారు దేశం విడిచి వెళ్లిపోవాలనే అర్థంలో వ్యాఖ్యలు చేయడం ఉగ్రవాద పెంపునకే తోడ్పడుతుందని అన్నారు. జాతీయ ఐక్యతకు, మత సామరస్యానికి ఇవి తోడ్ప డవని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు కలిసి మెలిసి ఉన్న రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చు రగిల్చాలని చూస్తున్నారన్నారు. ఇది చాలా ప్రమాదకమైనదని, మత సామరస్యాన్ని కాపాడుకునేందుకు రాష్ట్రంలో శాంతియాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ...

రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కాలేజీల్లో పదింటిని ప్రైవేటీకరణ చేస్తామని మిగతా 7లో



జగన్ (ఫైల్) కుషాల్ (ఫైల్) నిఖిల్ (ఫైల్)

ఈతకెళ్లి ముగ్గురు చిన్నారుల మృతి

ప్రజాశక్తి- వి.కోట (చిత్తూరు జిల్లా)

ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారులు మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా వి.కోట మండలంలో గురువారం చోటుచేసుకుంది. వి.కోట సిఐ సోమశేఖర్ తెలిపిన ప్రకారం.. వేసవి సెలవులు కావడంతో మోట్లపల్లికి చెందిన అన్నదమ్ములు పూర్ణేష్, జగన్ (9)లతోపాటు నిఖిల్ (12), కుషాల్ (11) గ్రామం సమీపంలోని చెరువు వద్దకు ఈతకు వెళ్లారు. పూర్ణేష్ మినహా మిగతా ముగ్గురు చిన్నారులు చెరువులో దిగి ఈత కొడుతున్నారు. అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో కొద్దిసేపటికి వారంతా నీటిలో మునిగి పోయారు. ఒడ్డున ఉన్న పూర్ణేష్ ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. స్థానికులు చెరువు వద్దకు చేరుకుని నీట మునిగిన వారిని కాపాడేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఇద్దరు మృతి చెందారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరు ప్రాణాలు కోల్పోయారు. సిఐ సోమశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కు కార్మికులను విధుల్లోకి తీసుకోండి

- ఇష్టానుసారంగా కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం
- పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ దృష్టికి తీసుకెళ్లిన పరిరక్షణ పోరాట కమిటీ జెఎసి
- సంబంధిత శాఖ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని స్టాండింగ్ కమిటీ హామీ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్ (ఆర్‌ఐఎన్‌ఎల్)లో యాజమాన్యం 5,541 మంది కాంట్రాక్టు కార్మికులను అన్యాయంగా తొలగించడంపై కార్మిక, టెక్స్‌టైల్స్, నైపుణ్యాల అభివృద్ధి శాఖ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ దృష్టికి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ జెఎసి తీసుకెళ్లింది. వారిని విధుల్లో తీసుకునేలా ఆదేశాలిచ్చేలా కృషి చేయాలని కోరింది. కార్మిక, టెక్స్‌టైల్, నైపుణ్యాల అభివృద్ధి శాఖ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బసవరాజు బొమ్మయ్ అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నుంచి పలు వినతులను స్వీకరించింది. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ జెఎసి చైర్మన్లు సిహెచ్.నర్సింగరావు (సిఐటియు), డి.ఆదినారాయణ (ఎఐటియుసి), మంత్రి రాజశేఖర్ (ఐఎన్‌టియుసి)లతో కూడిన బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌ఐఎన్‌ఎల్ ఏర్పాటు, అక్కడ జరుగుతున్న పరిణామాలను వివరించారు. ఆరేళ్లగా కొత్తగా పర్మినెంట్ ఉద్యోగులను నియమించట్లేదని కమిటీ ఎదుట ఎత్తిచూపారు. 35 ఏళ్ల నుంచి విశాఖ ఉక్కు కర్మాగారంలో 13 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు కోర్, నాన్ కోర్ విభాగాల్లో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారని వివరించారు. అయినా, వారికి వేతనాలు అరకొరగానే దక్కుతున్నాయన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు రిటైరైన తర్వాత కొత్తగా రిక్రూట్‌మెంట్ జరగడం లేదని, దీనివల్ల మిగతా 2లో



కార్మిక, టెక్స్‌టైల్, నైపుణ్యాల అభివృద్ధి శాఖ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బసవరాజు బొమ్మయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ జెఎసి నాయకులు

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- పుట్లూరు (అనంతపురం జిల్లా)



రామానుజలరెడ్డి (ఫైల్)

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పుట్లూరు మండలం రామానుజలరెడ్డి (35) తనకున్న ఐదెకరాల్లో చీనీ పంట సాగు చేశారు. ఆదాయం సరిగా లేకపోవడంతో వాటిని చీనీ చెట్లను తొలగించి మొక్కజొన్న వేశారు. దీనికీ సరైన ధర రాక నష్టాలు చవి చూశారు. పంటల సాగు నిమిత్తం చేసిన దాదాపు రూ.20 లక్షల అప్పు తీర్చడం కష్టం కావడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. బుధవారం రాత్రి తాడిపత్రి సమీపంలోని చల్లావారిపల్లికి వెళ్లే దారిలో రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. అటుగా వెళ్తున్న వారు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని వద్ద ఉన్న ఆధారాలతో ఆయనను గుర్తించి కుటుంబ సభ్యులకు రైల్వే పోలీసులు సమాచారం తెలియజేశారు. రామానుజలరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేటి నుంచి డిఎస్సీ


- అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి
- ఆ తరువాత లోనికి అనుమతిలేదు
- హాల్‌టిక్కెట్‌తో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్సీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30వ తేది వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజుకు రెండు పూటలా పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష సమయానికి 90 నిమిషాలు ముందునుంచి అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందు వరకే ఈ అనుమతి కొనసాగుతుంది. ఆ తరువాత ఎవరిని లోనికి అనుమతించేది లేదని అధికారులు చెబుతున్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు మరో గుర్తింపు కార్డును కూడా తప్పనిసరిగా తీసుకువెళ్లాలి. మెగా డిఎస్సీ పేరుతో 16,347 పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసిన తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 3,36,305 మంది అభ్యర్థులు ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఒకే అభ్యర్థి ఒకటికన్నా ఎక్కువ పోస్టుల కోసం అప్లై చేయడంతో మొత్తం 5,77,675 దరఖాస్తులు అందాయి. అభ్యర్థులు ఎంపిక చేసిన జిల్లా ప్రాధాన్యతల ఆధారంగా, పరీక్షా కేంద్రాలు అందుబాటులో ఉన్న సీటింగ్ సామర్థ్యం ప్రకారం కేటాయించినట్లు మెగా డిఎస్సి-2025 కన్వీనర్ ఎం వెంకటకృష్ణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం దరఖాస్తుల్లో 87.8శాతం అభ్యర్థులకు వారి మొదటి ప్రాధాన్యత జిల్లాలోనే పరీక్షా కేంద్రాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 137 పరీక్షా కేంద్రాలు, ఇతర రాష్ట్రాల్లో 17 కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. పరీక్షా ప్రక్రియను సిసిటివి లైవ్ నిఘా ద్వారా పర్యవేక్షిస్తారని, అభ్యర్థులకు బయోమెట్రిక్ ధృవీకరణ తప్పనిసరి అని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు సెక్షన్ 144 అమల్లో ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల సహాయం కోసం రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. apdsc.apcfss.in వెబ్‌సైట్ నుంచి అధికారికంగా జారీ చేసిన సూచనలు, మార్గదర్శకాలనే అభ్యర్థులు కచ్చితంగా పాటించాలని సూచించారు.

నవత ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థాపకులు .. కోటేశ్వరరావు కన్నుమూత

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్



విజయవాడ నగర ప్రముఖులు, అభ్యుదయ, ప్రజాస్వామ్య, వామపక్షవాది, నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరు పర్వతనేని వెంకట కోటేశ్వరరావు (82) గురువారం కన్నుమూశారు. వృద్ధాప్యంతో వచ్చిన అనారోగ్య సమస్యలతో కొద్దికాలంగా బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన ఆటో మొబైల్, రవాణా రంగాలకు మార్గదర్శకులుగా నిలిచారు. ముఖ్యంగా సరుకు రవాణా రంగంలో పేరుగాంచారు. కోటేశ్వరరావు అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. కోటేశ్వరరావు మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. ఆయన అత్యంత క్రమశిక్షణతో మెలుగుతూ సంస్థ సిబ్బంది పట్ల సానుకూలంగా వ్యవహరించేవారని గుర్తు చేసుకున్నారు.

కనీస ఏర్పాట్లు లేకుండా ఎలా నిర్వహిస్తారు?

- బెంగళూరు తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం
- 10వ తేదీకల్లా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశాలు
- సరిగా సన్నద్ధం కాలేకపోయామని అంగీకరించిన ప్రభుత్వం
- బెంగళూరు పోలీసు కమిషనర్, కీలక అధికారుల సస్పెన్షన్

బెంగళూరు : బెంగళూరు తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 11మంది మృతికి దారితీసిన ఈ ఘటనను కర్ణాటక హైకోర్టు సుమోటోగా తీసుకుని గురువారం మధ్యాహ్నం విచారణ చేపట్టింది. కనీస ఏర్పాట్లు లేకుండా ఇంత భారీస్థాయి కార్యక్రమాలను ఎలా నిర్వహిస్తారని ఈ సందర్భంగా కోర్టు ప్రశ్నించింది. ఇంతటి భారీస్థాయి కార్యక్రమాలు జరుగుతుంటే సమగ్రంగా ఎందుకు భద్రతా చర్యలు తీసుకోలేదంటూ చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా స్టేడియానికి గల 21 గేట్లు తెరిచారా అని కోర్టు ప్రశ్నించింది. అసలు క్రికెటర్లకు సన్మానం చేయాలని నిర్ణయించింది ఎవరు? సన్మానం చేయాలనుకుంది ఆర్‌సిబినా? కర్ణాటక అసోసియేషనా? లేక ప్రభుత్వమా? అంటూ అడ్వకేట్ జనరల్‌కు న్యాయమూర్తి సూటిగా పలు ప్రశ్నలు వేశారు. ఈ విషాదానికి కారణాలను వివరించాలని కోరారు. ఈ ఘటన జరగకుండా నివారించడానికి తీసుకున్న చర్యలేమిటి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూసేందుకు తీసుకోబోయే చర్యలేమిటి అని ప్రశ్నించింది. ఇంత ప్రాణ నష్టం జరిగిన ఈ ఘటనలో వాస్తవాలను కప్పిపుచ్చాలని చూస్తున్నారన్నారు. ఈ నెల 10లోగా అన్ని వివరాలతో కూడిన నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

సరిగా సన్నద్ధం కాలేకపోయాం కోర్టులో అంగీకరించిన రాష్ట్రప్రభుత్వం కీలక అధికారుల సస్పెన్షన్

అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నప్పటికీ ఊహించని రీతిలో జనాలు రావడంతో తొక్కిసలాట జరిగిందని అడ్వకేట్ జనరల్ తెలిపారు. ఈ మిగతా 7లో

కాకాణికి మూడు రోజుల పోలీసు కస్టడీ

- బెయిల్ పిటిషన్ 9కి వాయిదా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మూడు రోజులు పోలీసు కస్టడీకి ఇచ్చేందుకు న్యాయమూర్తి సుమ ఆమోదించారు. నెల్లూరు జిల్లా ఐదవ మున్సిపల్ మేజిస్ట్రేట్ కోర్టులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పైనా, పోలీసు కస్టడీకి సంబంధించి వాదనలు గురువారం జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాదోపవాదనలు సాగాయి. అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించి కాకాణిని విచారించాలని, ఆయనను ఐదు రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని ప్రభుత్వం తరపు న్యాయవాది రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. నెల్లూరు సెంటర్ జైల్లో కాకాణి రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నెల 9వ తేదీకి ఆయన రిమాండ్ ముగుస్తుంది. బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు న్యాయవాదులు రోజారెడ్డి, ఉమామహేశ్వరరావు వాదనలు వినిపించారు. ఇరువురి వాదనల అనంతరం బెయిల్ పటిషన్‌ను ఈ నెల 9వ తేదీకి న్యాయమూర్తి సుమ వాయిదా వేశారు. పోలీసు విచారణ నిమిత్తం మూడు రోజులు కస్టడీకి అనుమతించారు. శుక్రవారం ఉదయం కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు విచారణ నిమిత్తం కస్టడీకి తీసుకోనున్నారు.

లాసెట్ పరీక్షకు హాజరైన ఎబి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విశ్రాంత ఐఎఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు లాసెట్-2025 పరీక్షకు హాజరయ్యారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన గురువారం లాసెట్ పరీక్ష రాసేందకు వచ్చారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లపాటు అక్రమ సస్పెన్షన్‌లను ఆయన ఎదుర్కొన్నారు. ప్రింటింగ్, స్టేషనరీ కమిషనర్ హోదాలో ఉద్యోగ విరమణ చేశారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎబి వెంకటేశ్వరరావు నాలుగేళ్ల సస్పెన్షన్ కాలవ్యవధిని క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లాసెట్ రాసేందుకు ఒంగోలు వచ్చిన ఆయనను పలువురు శ్రేయోభిలాషులు మర్యాదపూర్వకంగా కలిశారు.

మంగళగిరికి 'ఎస్ఎస్‌సి' బోర్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పరీక్షల విభాగం(ఎస్ఎస్‌సి బోర్డు) కార్యాలయం గుంటూరు జిల్లా మంగళగిరికి తరలింది. ఇప్పటి వరకు విజయవాడలోని గొల్లపూడిలో ఉన్న ఈ కార్యాలయాన్ని మంగళగిరికి మార్చినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులు రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరిలో కళాశాల విద్య కమిషనర్ కార్యాలయం పక్కన ఉన్న నూతన భవనానికి మార్చినట్లు వెల్లడించారు. ఇక నుంచి కార్యకలాపాలు ఇక్కడి నుంచే ఉంటాయని సంబంధిత అధికారులు, ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు.

టిటిడి కల్తీ నెయ్యి నిందితుల బెయిల్ కేసు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల, తిరుపతి దేవస్థానం (టిటిడి)కి కల్తీ నెయ్యి సరఫరా కేసులో తమకు బెయిల్ ఇవ్వాలంటూ నిందితులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను ఈ నెల 17కి వాయిదా వేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కల్తీ నెయ్యి విషయంలో తిరుపతి తూర్పు పోలీసులు నమోదు చేసిన కేసులో తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ బోలేబాబా డెయిరీ, వైష్ణవీ డెయిరీ డైరెక్టర్లు అపూర్వ వినయకాంత్ చావ్లా, పోమిల్ జైన్, విపిన్ జైన్, ఏఆర్ డైరీ ఎండీ రాజు రాజశేఖరన్ ఇతరులు వేసిన వ్యాజ్యాలను గురువారం జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ విచారించారు.

పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్ పిల్ : పోలీసులకు నోటీసులు

టిడిపి నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు హత్య కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వైసిపి నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ టి. చంద్ర ధనశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టిడిపి నేతల హత్యలతో తమకు సంబంధం లేదని, రాజకీయ కుట్రలో భాగంగా తమను కేసులో ఇరికించారని పిటిషనర్లు తెలిపారు. దర్యాప్తునకు సహకరిస్తారని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. పోలీసుల వాదనల తర్వాతే తగిన ఉత్తర్వులు ఇస్తామన్న న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

చెట్లు నరికితే శిక్షలు

- 'ఆ' విధానాన్ని పరిశీలించాలి
- పర్యావరణ సలహాదారునిగా అంకారావు
- ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/తుళ్లూరు

'కొన్ని దేశాల్లో చెట్లను నరికితే కఠిన శిక్షలు విధిస్తున్నారు. మన రాష్ట్రంలో కూడా ఈ తరహా విధానాన్ని అమలు చేసే పరిశీలించాలి' అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజధాని అమరావతి పరిధిలో తుళ్లూరు మండలం అనంతవరంలో గ్రామంలో గురువారం నిర్వహించిన వన మహోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా . చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి మొక్కలు నాటారు. సభా వేదిక వద్ద పర్యావరణ పరిరక్షణ నిమిత్తం కాలుష్య మండలి ఏర్పాటు చేసిన స్టాళ్లను చంద్రబాబు, పవన్ కల్యాణ్ పరిశీలించారు.



అటవీ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలిస్తున్న చంద్రబాబు, పవన్

అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని అన్నారు. 2047 నాటికి 50 శాతం పచ్చదనం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. 2029 నాటికి 37 శాతం పచ్చదనం సృష్టిని లక్ష్యంగా తీసుకున్నట్లు చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో వెళ్లినా కింద చెట్లను నరికించే వారని, అటువంటి విధానాలను అనుమతించకూడదని అన్నారు. . చెట్లు లేకపోతే వర్షాలు కురవవని, భూగర్భ జలాలు ఇంకిపోతాయని, సాగు ప్రమాదంలో పడుతుందని, ఫ్లోరైడ్ పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతారని చెప్పారు. ఈ ప్రమాదం నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే నాలుగేళ్లలో కనీసం 14 శాతం మేరకు పచ్చదనం పెంచేలా మొక్కలు నాటే ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. 'సీడ్ రాఖీ'తో ఆడబిడ్డలు పర్యావరణానికి దోహద పడాలన్నారు. ప్లాస్టిక్ రీ సైక్లింగ్‌కు త్వరలో ఒక విధానం తీసుకువస్తామన్నారు. అమరావతిని సుందర నగరంగా తీర్చిదిద్దుతామని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతి రాజధాని భవిష్యత్ తరాలకు దిక్సూచిగా మారుతుందన్నారు. మియావాకీ తరహా గార్డెన్లు సహా అనేక దేశాల గార్డెన్లు అమరావతిలో పెంచుతామన్నారు. నల్లమల అడవులను పరిరక్షిస్తున్న కొమెర అంకారావును అడవులు, పర్యావరణ శాఖ సలహాదారుగా నియమిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఈమేరకు త్వరలో ఉత్తర్వులు ఇస్తామన్నారు.

చెట్లు లేని సమాజాన్ని ఊహించలేం : పవన్ కల్యాణ్

చెట్లులేని సమాజాన్ని ఊహించలేమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని వృక్షాలుగా అభివృద్ధి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోరారు. రాబోయే నాలుగేళ్లలో ప్రస్తుతం ఉన్న పచ్చదనం 23 శాతం నుంచి 37 శాతంకు పెంచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంకారావు మూడు దశాబ్దాల నుంచి నల్లమల అడవుల అభివద్ధికి కషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరు మండలం అనంతవరం జెడ్పి హైస్కూల్ విద్యార్థిని భూక్యా లావణ్య పర్యావరణ పరిరక్షణ కై సభకు వచ్చిన వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. సభలో మునిసిపల్ మంత్రి పి.నారాయణ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థ సారధి భాస్కర్, అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అనంతరాములు, సిఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు, పొల్యూషన్ కంట్రోలు బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో జియో డేటాబేస్

- భూములు, ఆస్తులకు ప్రత్యేక నెంబర్లు
- 25 చదరపు కిలోమీటర్లకు ఒక గ్రిడ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని పరిధిలో ఆస్తుల చిట్టాను ఆధునీకరించనున్నారు. దీనికోసం జియోడేటా బేస్ ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించనున్నారు. ప్రస్తుతం ప్రపంచబ్యాంకు అప్పు తీసుకుంటున్న ప్రభుత్వం తిరిగి చెల్లింపునకు రాజధాని పరిధిలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రత్యేకంగా చూపించారు. దీనికోసం ఇప్పుడున్న 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న భూములు, ఆస్తుల వివరాలనూ డిజిటలైజ్ చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్లు, భవనాలు, వ్యక్తిగత ఆస్తులకు ప్రత్యేక నెంబర్లు కేటాయించనున్నారు. దీనికోసం మూడుదశల్లో డ్రోన్ సర్వే నిర్వహిస్తారు. మొత్తం సమాచారాన్ని భవిష్యత్ అవసరాలకు ఎలా వినియోగించుకోవాలనే ప్రణాళికను రెండోదశలో చేపట్టనున్నారు. మొత్తం సర్వే పూర్తయిన తరువాత యూనిక్ ల్యాండ్ పార్శిల్ ఐడెంటిఫికేషన్ నంబర్(యుఎల్ పిఐఎన్), యూనిక్ ప్రాపర్టీ ఐడెంటిఫికేషన్ నెంబరు(యుపిఐఎన్), డిజిటల్ డోర్ నెంబర్స్(డిడిఎన్) కేటాయించనున్నారు. ఈ సర్వేతో ప్రస్తుతం ఉన్న వీధుల వివరాలూ, డోర్ నెంబర్లు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రతి ఆస్తి, వ్యక్తులు, వారి ఆర్థికస్థితిగతులు, భూములకు సంబంధించిన సమగ్ర వివరాలూ ఇక సిఆర్‌డిఏ దగ్గర ఉండనున్నాయి. ఈ ప్రక్రియ కోసం సిఆర్‌డిఏ ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు ఆహ్వానించింది. డిజిటల్ అమరావతి పేరుతో ఈ సర్వే చేపట్టినా భవిష్యత్‌లో ఆస్తులకు సంబంధించిన నిర్వహణ, వాటి పన్నులు వంటి అంశాలు ఇందులో కీలకం కానున్నాయి. దీనికి తోడు ఆస్తివిలువ ఆధారంగా పన్నులు వసూలు చేసే ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ఇదే పద్ధతిని అమరావతిలోనూ అమలు చేయనున్నారు. రాజధాని నిర్దేశిత ప్రాంతంలో ఉన్న వ్యక్తులు, వారి ఆస్తులు, నివాసాలు, భూమి ఇతర అంశాలకు సంబంధించిన అన్ని వివరాలనూ సమగ్రంగా ఈ డేటాలో ఉంచనున్నారు. దీనికోసం 25 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ఒక గ్రిడ్‌గా రూపొందించనున్నారు. మొత్తంగా 60 చదరపు కిలోమీటర్ల నివాస ప్రాంతాలు, 160 చదరపు కిలోమీటర్ల భూములకు సంబంధించిన 30 అంశాలతో కూడిన సమాచారాని పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నారు.

అలాగే వ్యక్తులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కూడా ఇందులో చేర్చనున్నారు. ప్రస్తుతం ఉంటున్నవారు, కొత్తగా వచ్చేవారి వివరాలనూ ఎప్పటికప్పుడు ఆధునీకరించనున్నారు. ప్రస్తుతం అమరావతి నగరానికి ఎక్కడకెక్కడ ప్రవేశమార్గాలున్నాయి, 29 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న అన్నిరకాల నిర్మాణాలు, ఆస్తుల వివరాలనూ సమగ్రంగా సేకరించనున్నారు. ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్ల వివరాలనూ డేటా రూపంలో ఆధునీకరిస్తారు. ప్రతి 1000 ఎకరాలకు ఒక యూనిట్‌గా ఏర్పాటవుతున్న కాలనీలకు ఏ రోడ్డు వెళుతుందనే విషయాన్ని డేటాలో పెడతారు. పెరుగుతున్న జనాభా, భవిష్యత్‌లో అమరావతి నగరానికి వచ్చే వారికి అవసరమైన సదుపాయాలు, ఎక్కడ ఎలా కల్పించాలనే అంశాలనూ ఈ సర్వేలో గుర్తించనున్నారు.

అక్రమ కార్యకలాపాలపైనా డేటా

అమరావతి నగర నిర్మాణం చేపట్టిన తరువాత ప్లాన్లకు విరుద్ధంగా ఏమైనా కార్యకలాపాలు జరుగుతున్నాయా అనే వివరాలను కూడా దీని ఆధారంగా సేకరించనున్నారు. దీనికోసం ప్రభుత్వం వద్ద ఉన్న డేటాను ఎంపిక చేసిన సంస్థకు అప్పగించనున్నారు. అక్కడ నుండి సంస్థ సర్వే చేయడం ద్వారా మరింత సమగ్ర సమాచారాన్ని సేకరిస్తుంది. అయితే పైకి సమాచార సేకరణ నిమిత్తం అని చెబుతున్నా ప్రస్తుతం తీసుకుంటున్న అప్పుల తిరిగి చెల్లింపులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి ఫీజిబులిటి నివేదిక తయారు చేయాల్సి ఉంది. అందులో భాగంగానే తొలిదశలో ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిసింది.

అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్వవైభవం

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సంధ్యారాణి
- ఇండక్షన్ స్టౌలు అందజేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్వవైభవం తీసుకొస్తామని స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. అంగన్‌వాడీ సెంటర్లకు ఇండక్షన్ స్టౌల పంపిణీ కార్యక్రమం విజయవాడలో ఓ ప్రైవేట్ హోటల్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ స్టవ్‌లు కాలుష్య రహితమే కాకుండా పిల్లలకు వీటి వల్ల ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా సురక్షితమైన పద్ధతిలో తయారుచేశారని వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్లకు యాప్‌ల భారాన్ని తగ్గించడమే కాకుండా వారి జీతభత్యాల పెంపు, గ్రాట్యుటీ అంశాలపై వారికి న్యాయం చేస్తుందని చెప్పారు. సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.లక్ష మంజూరు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అద్దె భవనాల్లో ఉన్న వాటికి ఆర్‌వో ప్లాంట్, టాయిలెట్ల నిర్మాణానికి సరిపడా నగదు అందిస్తామన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తామని, ఒక టీచర్‌తో పాటు అదనంగా ఆయా టీచర్‌ను నియమిస్తామని చెప్పారు. పిల్లల సంరక్షణ బాధ్యత అంగన్‌వాడీలదే అని తెలిపారు. గర్భిణులకు సమయం ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు. పిల్లలకు ఇవ్వాల్సిన వ్యాక్సిన్‌లతో ఎలాంటి జాప్యం వహించొద్దన్నారు. ఇఇఎస్ఎల్ సిఇవో విశాల్ కపూర్ మాట్లాడుతూ ఇంధన సామర్థ్యం వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్‌చార్జీలను నియంత్రించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి సూర్యకుమారి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



సాగు పనుల్లో భాగంగా విత్తనాలు చల్లుతున్న రవి, వ్యకాస నేతలు, పేదలు

ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు పంచాలి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ రవి

ప్రజాశక్తి - టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం (ఏలూరు జిల్లా)

ఎర్ర కాల్వ మిగులు భూములను పేదలకు పంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలంలోని సాలిగూడెం సమీపంలో, జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం, చిన్నవారిగూడెం గ్రామాల పరిధిలోని ఎర్రకాలువ మిగులు భూముల్లో సంఘం ఆధ్వర్యంలో గురువారం పేదలతో కలిసి దుక్కి దున్ని, విత్తనాలు చల్లి సాగు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మిగులు భూముల్లో పేదలు సాగుకు సన్నద్ధం కావాలని కోరారు. సాగు చేస్తున్న గిరిజన, పేదలందరికీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ పేదలంతా ఐక్యంగా పోరాడి భూములు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, నాయకులు, పేదలు పాల్గొన్నారు.

అంబటిపై కేసు నమోదు

- లోకేష్ కుట్రలో భాగమేనని రాంబాబు ఆరోపణ

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని పట్టాభిపురం సిఐ వెంకటేశ్వర్లుతో రోడ్డుపై వాగ్వివాదానికి దిగిన మాజీ మంత్రి అంబటి రాంబాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ బిఎన్ఎస్ సెక్షన్ 353 కింద పట్టాభిపురంలో కేసు నమోదు చేశారు. దీనిపై అంబటి స్పందిస్తూ, మంత్రి లోకేష్ కుట్రలో భాగంగానే తనపై తప్పుడు కేసు నమోదు చేశారని ఆరోపించారు. బుధవారం ఉదయం వైసిపి ధర్నా జరిగే కలెక్టరేట్‌కు వెళ్తుండగా రాంబాబును పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిఐ గంగా వెంకటేశ్వర్లుకు, అంబటికి మధ్య వాగ్వాదం జరిగింది. అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారంటూ, తమను వ్యక్తిగతంగా దూషించారంటూ, తమ విధులకు ఆటంకం కలిగించారంటూ పోలీసులు అంబటితో సహా మరికొంత మందిపై బుధవారం పొద్దుపోయాక కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో అంబటి గురువారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడారు. మంత్రి లోకేష్ బంధువైన సిఐ వెంకటేశ్వర్లు తనను అడ్డుకుని రెచ్చగొట్టి తనతో ఏదో ఒక విధంగా తప్పు చేయించాలని దురుసుగా మాట్లాడారని ఆరోపించారు. తనను అక్రమంగా నిర్బంధించి అరెస్టు చేయాలన్న కుట్రతో ప్రభుత్వం పోలీసు అధికారిని తనపైకి ఉసిగొల్పిందని విమర్శించారు. అయినా, తాను సంయమనంతో వ్యవహ రించానన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నందున ఏదో కేసులో ఇరికించి అరెస్టు చేసి జైలుకు పంపాలన్న ఆలోచన లోకేష్‌కు ఉందని విమర్శించారు.

'ప్రైవేటు'కు 'భోజనం' ఇవ్వొద్దు

- ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మూడు జిల్లాలో ప్రైవేటు సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి నేతృత్వంలో నాయకులు విద్యా శాఖ మంత్రి లోకేష్ ఓఎస్‌డి వెంకట రమణకు వినతి పత్రాన్ని సచివాలయంలో గురువారం అందజేశారు. కార్మికులకు శిక్షణ పేరుతో పార్వతీపురం మన్యం, ఎన్‌టిఆర్, తిరుపతి జిల్లాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని టాటా ట్రస్టు, విజయవాహిని, జిహెచ్ఎస్ఐ సంస్థలకు మూడేళ్ల కాలపరిమితితో అప్పగించిందన్నారు. గతంలో నవ ప్రయాస, ఏకాశక్తి వంటి సంస్థలు ఈ పథకాన్ని సక్రమంగా అమలుచేయకపోవడంతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారని తెలిపారు. ప్రైవేటు సంస్థలకు ఈ పథకాన్ని అప్పగించడం వల్ల వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని, అక్షయపాత్ర సంస్థ నిర్వహిస్తున్న చోట్ల వర్కర్లకు, వారి బ్యాంక్ ఖాతాల్లోనే వేతనాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకంలో పనిచేస్తున్న 85 వేల మంది కార్మికులకు రూ.3 వేలు వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, నెలలు తరబడి బిల్లులు పెండింగ్ పెడుతున్నారని తెలిపారు. కార్మికులకు నెలకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని, ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలన్నారు. వంటకు అవసరమైన గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా స్కూల్ విద్యార్థులకు మెనూ ఛార్జీలు రూ.20, కాలేజీ విద్యార్థులకు రూ.60 చెల్లించాలని కోరారు. ఏడాదికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. జోన్ల వారీ మెనూను రద్దు చేసి రాష్ట్రవ్యాప్తంగా ఒకే మెనూను అమలు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో జి.సుందరమ్మ, కె.శివలీల, పి.విమల, ఎస్‌కె షమీ, జి.సుమక్క ఉన్నారు.

మామిడి, పొగాకు, కోకో కొనుగోళ్లకు రూ.550 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించినట్లు తెలిపారు. కోకో పంట కేజీ 450 రూపాయలకు కంపెనీలు కొనుగోలు చేస్తే ప్రభుత్వం అదనంగా మరో 50 రూపాయలు చెల్లిస్తుందని చెప్పారు. ఇలా దాదాపు వెయ్యి మెట్రిక్ టన్నుల కోకోను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని, ప్రభుత్వం అందించే లబ్ధి నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతుందని మంత్రి చెప్పారు.

పొగాకుకు ప్రత్యామ్నాయం

హెచ్డీ బర్లీ(బ్లాక్ బర్లీ)పొగాకు ప్రత్యామ్నాయంగా అపరాలు, చిరుధాన్యాలు పండించేలా రైతులతో చర్చించి ప్రోత్సాహించాలని అధికారులను సిఎం ఆదేశించారు. సమీక్షలో ఆయన మాట్లాడుతూ ధరలు లేనప్పుడు ప్రత్యామ్నాయ పంటల వైపునకు రైతులను మళ్లించే బాధ్యత వ్యవసాయ శాఖదేనని చెప్పారు. పొగాకు బోర్డు పొగాకు విషయంలో బోర్డు తిప్పేసేలా వ్యవహరించకూడదని అన్నారు .హెచ్డీ బర్లీ పొగాకులో రెండు, మూడు గ్రేడ్ రకాలు కొనేందుకు కంపెనీలు ఆసక్తి చూపించడం లేదని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కంపెనీలతో సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. వైట్ బర్లీ పొగాకు రకాన్ని ఒప్పందం మేరకే సాగు చేయించి కంపెనీలే కొనుగోలు చేయాలని చెప్పారు. ఏ వ్యవసాయ ఉత్పత్తి అయినా అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గకుండా ఉండేలా చూడాలని ఆదేశించారు. అనుకొని పరిస్థితుల్లో ధర రాకుంటే ప్రభుత్వం ఆదుకునేలా ఉండాలని చెప్పారు. వ్యవసాయానికి ప్రభుత్వం అండగా ఉందనే భరోసా రైతులకు కలిగించాలని వెల్లడించారు.

'ఉక్కు' కార్మికుల తొలగింపు దారుణం

(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్టు కార్మికులపై పనిభారం పెరుగుతోందని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను వేధిస్తూ తొలగిస్తోందని స్టాండింగ్ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. రీజనల్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) వద్ద జరిగిన కాంట్రాక్టు కార్మిక సంఘాలు, యాజమాన్యం జాయింట్ మీటింగ్‌లో కుదిరిన ఒప్పందాలను సైతం బుట్టదాఖలవుతున్నాయని వివరించారు కొంతమంది కార్మికులను అకారణంగా, ఇష్టానుసారంగా తొలగించడంతో మిగతా కార్మికులు సమ్మె చేశారని, దీంతో కక్షగట్టిన యాజమాన్యం 5,541 మంది కాంట్రాక్టు కార్మికులను నిర్దాక్షిణ్యంగా తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కనీసం నోటీసుగానీ, ముందస్తు సమాచారంగానీ ఇవ్వలేదని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. బయోమెట్రిక్‌లో వారి పేర్లను తీసేసి విధులకు రావొద్దని విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం చెప్పిందని వివరించారు. కార్మిక చట్టాలను, రాజ్యాంగ హక్కులను విస్మరించి తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ అంశాన్ని సంబంధిత శాఖ దృష్టికి తీసుకెళ్లి కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామని బసవరాజు బొమ్మయ్ హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జెఎసి నాయకులు ఎన్.రమణ, వై.శ్యాం, ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి నాగన్నగౌడ్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ యాదవ్, రాష్ట్ర నాయకులు ఆదిల్ షరీఫ్, హెచ్ఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు తదితరులు ఉన్నారు.

పనిగంటలు పెంపు దుర్మార్గం

- లేబర్ కోడ్స్ అమలును నిలిపివేయండి
- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పనిగంటలు పెంచుతూ రాష్ట్రమంత్రిమండలి తీసుకున్న నిర్ణయం దుర్మార్గమని సిపిఎం రాష్ట్రకమిటీ పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జులై 9న యావత్ కార్మికవర్గం దేశవ్యాప్తంగా సమ్మెకు సన్నద్ధమవుతున్న దశలో రాష్ట్రమంత్రిమండలి తీసుకున్న ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తునట్లు తెలిపారు., కార్మికసంక్షేమం దృష్టా లేబర్ కోడ్స్ అమలును రాష్ట్రంలో నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. 8 గంటల పనికోసం పోరాడి సాధించుకున్న కార్మికవర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్రప్రభుత్వం నిరణయం తీసుకోవడాన్ని ప్రజావ్యతిరేక చర్యగా ఆయన అభివర్ణించారు. కార్మికుల రక్తమాంసాలు పిండి కార్పొరేట్లకు ఇబ్బడిముబ్బడిగా లాభాలు కట్టబెట్టేందుకే చంద్రబాబు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి జరుగుతున్న కాలంలో, ఏఐ విస్తరించి మానవ శ్రమను తగ్గిస్తున్న ఆధునిక యుగంలో పనిగంటలు తగ్గించాల్సింది పోయి పెంచడం దారుణమని అన్నారు. పైగా కనీస వేతనాలు పెంచడానికి ప్రభుత్వం సిద్ధపడలేదని తెలిపారు. ఒకవైపు ధరలు పెరిగి శ్రామికుల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని,కొనుగోలు శక్తి తగ్గి ఆర్థిక మాంద్యానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థితిలో పనిగంటలు తగ్గించి అదనపు ఉపాధిని కల్పించాల్సిందిపోయి నిరుద్యోగాన్ని పెంచే ఈ చర్య అభివృద్ధి నిరోధకమైందని పేర్కొన్నారు. తక్షణం లేబర్ కోడ్స్‌ను, దాని అనుబంధ రూల్స్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. లేబర్: కోడ్స్‌కు వ్యతిరేకంగా జులై 9న జరగనున్న జాతీయ సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలిపారు. యావత్ కార్మికవర్గం ఐక్యంగా ఈ దాడిని ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికులకు నష్టదాయకం: సిఐటియు

కార్మిక వర్గానికి నష్టదాయకంగా కార్మిక చట్టాలను మారుస్తూ రాష్ట్రమంత్రిమండలి నిర్ణయం తీసుకుందని సిఐటియు పేర్కొంది. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. ఈ మార్పులను ఉపసంహరించుకోవాలని యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 50 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్న షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో 13 ఏళ్లుగా కనీస వేతనాల సవరణ జరగలేదని, కనీస వేతనాల బోర్డును నియమించలేదని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు పథకాలను పునరుద్ధరించలేదని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమానవేతనం అమలు చేయడం లేదని వారు తెలిపారు. వీటి అమలుపై నోరు మెదపని చంద్రబాబు ఎ ప్రభుత్వం, మోడీ ప్రభుత్వ విధానాలను అమలు చేయడానికి తహతహలాడుతోందని పేర్కొన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్త లేబర్‌కోడ్స్‌ను తెచ్చి, కార్మికవర్గం హక్కులను హరించాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. .కార్పొరేట్ల ప్రయోజనం కోసం పనిగంటలు, ఓటి కాలాన్ని నిర్ణయించడం, సాధికారిత పేరుతో రక్షణ కల్పించకుండా మహిళల చేత రాత్రిపూట పనిచేయించాలనడం దుర్మార్గవని పేర్కొన్నారు. కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే పెరిగిన ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనాల సవరణ వెంటనే చేయాలని, మహిళల రక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

దుర్మార్గం: శ్రామిక మహిళా రాష్ట్రసమన్వయ కమిటీ

మహిళా సాధికారత పేరుతో మహిళలకు నైట్ డ్యూటీలు చేయించాలనే రాష్ట్రప్రభుత్వ నిర్ణయం దుర్మార్గమని,దీనిని ఖండిస్తున్నట్లు

శ్రామిక మహిళా రాష్ట్రసమన్వయ కమిటీ తెలిపింది. పట్టపగలే మహిళలకు రక్షణ లేదని, అత్యాచారాలు, హత్యలు,దాడులు మహిళలపై పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఇలాంటి నిర్ణయం చేయడం సబబుకాదని కమిటీ కన్వీనర్ కె ధనలక్ష్మీ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇది మహిళా సాధికారత కాదని, మహిళా విఘాతం అని తెలిపారు. ఇప్పటికే భద్రత లేని ఉద్యోగాల్లో నియమించబడ్డ శ్రామిక మహిళలు కనీస వేతనాలు, పనిభద్రత, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు, మంచినీళ్లు వంటి సౌకర్యాల కోసం పోరాడుతున్నారని తెలిపారు. ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం చేసిన నిర్ణయం మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ఉందని మండిపడ్డారు. నైట్ డ్యూటీలు చేయించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం తీసుకున్న దుర్మార్గమైన నిర్ణయాన్ని కార్మికవర్గం, శ్రామిక మహిళలు తిప్పికొట్టాలని కోరారు.

శరాఘాతం: ఎస్‌డబ్ల్యూఎఫ్

రాష్ట్రప్రభుత్వ నిర్ణయం ఉద్యోగ, కార్మికుల పాలిట శరాఘాతమని ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ విమర్శించింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ బాటలోనే రాష్ట్రప్రభుత్వం కూడా కార్మిక హక్కులపై దాడి చేస్తూ క్యాబినేట్‌లో నిర్ణయం చేసిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు నైట్ డ్యూటీలు ఆర్టీసి వంటి రంగాల్లో పనిచేస్తున్న వారికి పెద్దముప్పు వంటిదని పేర్కొంది.

ప్రతి కోకో గింజా కొనుగోలు చేయాల్సిందే

- ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోకో రైతుల వద్ద ఉన్న ప్రతి కోకో గింజా కొనుగోలు చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, కోకో గింజలు కిలోకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.500కు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. కోకో గింజలు కొనుగోలు చేయకుండా కోకో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే తిరిగి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని సమావేశం హెచ్చరించింది. ఏలూరులోని అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన గురువారం జరిగింది. కోకో రైతుల సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు, ఎపి రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ.. కోకో గింజల కొనుగోలుకు ప్రభుత్వ లక్ష్యం పూర్తయిందని చెప్పడం తగదన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకపోవడం వల్ల ఇప్పటికే కోకో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ ధరకు



సమావేశంలో నినదిస్తున్న కోకో రైతు సంఘం నేతలు

అనుసంధానిస్తూ ఫార్ములా రూపొందించి కోకో గింజలకు గిట్టుబాటు ధర నిర్ణయించే విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధర కోసం కోకో రైతుల పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుతం రైతుల వద్ద ఉన్న కోకో గింజలు పూర్తిగా కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, కోకో తోటలు కౌలుకు తీసుకున్న రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కోకో గింజలు కొనుగోలు చేయకపోతే ఏలూరు జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎపి కోకో రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు సింహాద్రి గోపాలకష్ణ, ఉపాధ్యక్షులు బోళ్ళ వెంకట సుబ్బారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుది బండి వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నరసింహారావు, జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ తరలిస్తున్న ముఠా అరెస్టు

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

డ్రగ్స్ తరలిస్తున్న ముఠాను విజయవాడ పటమట పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2 లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డిసిపి సరిత గురువారం మీడియాకు వెల్లడించారు. ఈ వివరాల ప్రకారం... వాహనాల తనిఖీ సమయంలో ముగ్గురు వ్యక్తులు డ్రగ్స్‌తో పట్టుబడ్డారు. దీంతో, తిరుమలశెట్టి జీవన్ కుమార్, నితీష్ కుమార్, ప్రసాద్‌లను ఎసిపి దామోదర్, సిఐ పవన్ కిషోర్ అరెస్టు చేశారు. నిందితుల నుంచి 33 గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. యూనివర్సిటీ విద్యార్థులకు వీటిని అమ్ముతున్నట్లు విచారణలో తేలింది. ఈ డ్రగ్స్ కొరియర్‌లో వచ్చినట్లు గుర్తించారు. డిటిడిసి కొరియర్ సిబ్బంది పాత్రపైనా పోలీసులు విచారిస్తున్నారు. ఈ తరహా డ్రగ్స్, గంజాయి ఎక్కడ నుంచి తెస్తున్నారు, ఎక్కడకు చేర్చుతున్నారు అనే అంశాలపై పోలీసులు దృష్టి పెట్టారు.

పిఅండ్‌జిలో 7వేల మంది ఉద్యోగులపై వేటు

వాషింగ్టన్ : ప్రముఖ గ్లోబల్ ఎఫ్ఎంసిజి కంపెనీ ప్రాక్టర్ అండ్ గ్లాంబుల్ వచ్చే రెండేళ్లలో తమ ఉద్యోగుల్లో 15 శాతం మందిని ఇంటికి పంపించాలని నిర్ణయించింది. ప్రపంచ వ్యాప్తంగా తనకున్న ఉద్యోగుల్లో దాదాపు 7,000 మందిపై వేటు వేయనున్నట్లు వెల్లడించింది. స్థానిక చట్టాలకు అనుగుణంగా తొలగింపులను చేపట్టనున్నట్లు తెలిపింది. ప్రాంతాల వారిగా ఎంత మందిని తొలగించేది ప్రస్తుతం సమాచారం అందుబాటులో లేదని పేర్కొంది. ఉద్వాసనలకు సంబంధించి రాబోయే రెండు ఆర్థిక సంవత్సరాల్లో ప్రణాళికలు అమలు చేయబడతాయని ఆ కంపెనీ తెలిపింది. "వాటాదారులకు నగదు రాబడిపై తమ బలమైన ట్రాక్ రికార్డ్‌ను కొనసాగిస్తాము. ఆర్థిక సంవత్సరం 2024-25 తొలి మూడు త్రైమాసికాల్లో వాటాదారులకు 13 బిలియన్ డాలర్ల విలువ చేసే డివిడెండ్, షేర్ల పునకొనుగోళ్ల ద్వారా అందించాము." అని పిఅండ్‌జి చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఆండ్రీ షుల్టెన్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శైలేష్ జెజురికార్ పేర్కొన్నారు. "పోటీ తీవ్రంగా ఉంది. భౌగోళిక రాజకీయ వాతావరణం అనూహ్యంగా ఉంది. సాంకేతికత రోజువారీ జీవితంలోని దాదాపు ప్రతి అంశాన్ని వేగంగా మారుస్తోంది. అదే సమయంలో ప్రస్తుతం సేవలు అందని, తక్కువ సేవలు పొందుతున్న వినియోగదారుల అవసరాలను మెరుగ్గా తీర్చడం, కొత్త విభాగాలలోకి విస్తరించడం, మార్కెట్‌లను అత్యుత్తమ స్థాయిలకు పెంచడం ద్వారా భారీ వృద్ధిపై దృష్టి సారిస్తున్నాము." అని ఆ కంపెనీ పేర్కొంది.

బర్లీ పొగాకు కొనకుంటే రహదారుల దిగ్బంధం

- జిపిఐ కంపెనీ వద్ద ధర్నాలో నేతల హెచ్చరిక

ప్రజాశక్తి-గుంటూరు

రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయకుంటే రహదారుల దిగ్బంధనం, గ్రామీణ బంద్ చేపడతామని రైతు సంఘాలు హెచ్చరించాయి. రైతులకు బాండ్లు ఇచ్చినా పంట కొనుగోలు చేయకపోవడంతో గుంటూరులోని జిపిఐ కంపెనీ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో గుంటూరు, ప్రకాశం, బాపట్ల, నంద్యాల జిల్లాల నుండి రైతులు పాల్గొన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ధర్నాలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ పొగాకు సాగులో ఈ ఏడాది ఒక చీకటి అధ్యాయమని పేర్కొన్నారు. కంపెనీలు హామీ ఇవ్వడంతో చిన్న, సన్నకారు రైతులు అప్పులు చేసి పంట వేశారని, కంపెనీలు మాత్రం కొనుగోలు చేయట్లేదన్నారు. మార్చి చివరి నాటికి కొనాల్సిన పంటకు ఇంకా మూడు, నాలుగు నెలల గడువు అడగడం సరికాదని తెలిపారు. కంపెనీలకు లక్ష్యాలు నిర్దేశించి కొనుగోలు చేయిస్తామని చెప్పిన మంత్రి అచ్చెన్నాయుడు హామీ కూడా నెరవేరలేదన్నారు. జిపిఐతోపాటు ఐటిసి, ఎంఎల్ వంటి వివిధ కంపెనీలన్నీ పంటను కొనాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కంపెనీలతో కొనుగోలు చేయించే బాధ్యతను తీసుకోవాలని, ప్రభుత్వానికి ఉన్న విశేష అధికారాలు ఉపయోగించి ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు రైతులు ఐక్యంగా ఉద్యమించటానికి సిద్ధం కావాలని కోరారు. వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిసారి పొగాకు రైతుల ఆత్మహత్యలు చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో 450 గ్రామాల్లో దాదాపు 70 మిలియన్ కిలోల పొగాకు సాగు అయ్యిందని, ప్రతీ కేజీ కొనాల్సిందనేని డిమాండ్ చేశారు. కంపెనీలు పంట కొనకపోగా రైతులను పోలీసులతో బెదిరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం, పది రోజుల్లో కొనుగోళ్లు ఊపందుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కంపెనీలు వేలాది మంది పొగాకు రైతుల జీవితాలతో ఆటలాడుతున్నాయన్నారు. రైతులను మోసం చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కంపెనీ ప్రతినిధులతో రైతు సంఘాల నాయకులు, వడ్డే శోభనాద్రీశ్వరరావు చర్చలు జరిపారు. బాండ్లు ఇచ్చిన తెల్లబర్లీ మొత్తం నెల రోజుల్లోగా కొంటామని, రెండు మిలియన్ కేజీల నల్లబర్లీ కొంటామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. రైతు నాయకులు కనీసం రూ.10 మిలియన్ కేజీల నల్లబర్లీ కొనాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రసాద్, నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, వివిధ రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

జగన్ తీరు మారకుంటే ఈసారి ఒక్క సీటే..

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీరు మారకుంటే ప్రజలు ఈసారి ఒక్క సీటుకే పరిమితం చేస్తారని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం మండలం పాత్రునివలసలో గురువారం ప్రపంచ పర్యవరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మోడీ, చంద్రబాబు క్రియేట్ చేసిన ఎపి బ్రాండ్ వాల్యూను దెబ్బతీయడమే జగన్ పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు రాకుండా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు వెన్నుపోటు దినం పేరుతో ఏదో హడావుడి చేయాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంతృప్తితో ఉన్నారని చెప్పారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ ఇక సాధ్యం కాదనుకున్నామని, టిడిపి కూటమి ప్రభుత్వంలో వాటిని సాధించుకున్నామని తెలిపారు. ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనల ఇచ్చి రాష్ట్ర అభివృద్ధికి కలిసికట్టుగా రావాలని కోరారు. జగన్ ఇదే వైఖరితో ఉంటే 151లో ఐదు పోయి 11 వచ్చినట్లు, ఈసారికి ఒక్క సీటుకే పరిమితం అవుతారని పేర్కొన్నారు.

భద్రతా వైఫల్యం వల్లే యువకుల మరణాలు

- సిపిఐ నేత నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: బెంగళూరులో ఐపిఎల్ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో అమాయక యువకులు ప్రాణాలను కోల్పోవడం దురదృష్టకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. భద్రతా వైఫల్యం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని విమర్శించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆపత్కాలంలో చంద్రబాబుకు కమ్యూనిస్టులే అండగా నిలిచిన విషయాన్ని మరచిపోయి, ఒక ప్రధాన ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ కమ్యూనిస్టులను పక్కన పెట్టానని మాట్లాడటం సరికాదన్నారు. టిడిపికి తొలినాళ్ల నుంచి కమ్యూనిస్టులు మద్దతిచ్చా యని, ఇప్పుడు బిజెపి అవసరాల కోసం కమ్యూనిస్టులను వ్యతిరేకిస్తూ మాట్లాడటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత అనుభవాలను గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వ కుల, జనగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సనాతన ధర్మం పేరుతో ఆర్ఎస్ఎస్ ఎజెండాను అనుసరిస్తున్నా రని నారాయణ విమర్శించారు. సనాతన ధర్మం గురించి గరికపాటి నరసింహారావు వద్ద పవన్ కల్యాణ్ ట్యూషన్ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

- ఇద్దరు దుర్మరణం
- ఏడుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు (నెల్లూరు జిల్లా)

ఆటోను కారు ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. ఆత్మకూరు మండల పరిధిలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన తొమ్మిది మంది మహిళలు ఆటోలో ముస్తాపురం గ్రామంలో పొగాకు గ్రేడింగ్ పనులకు వెళ్తున్నారు. ఎఎస్‌పేట అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆటోను మలుపు తిప్పుతున్న సమయంలో మర్రిపాడు నుండి నెల్లూరు వైపునకు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ పుల్లారెడ్డి (45), ఆటోలో ప్రయాణిస్తున్న అజీమా (50) అనే మహిళ సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. మరో ఏడుగురికి గాయాలు కాగా వారిని 108 వాహనంలో ఆత్మకూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మకూర్ సిఐ జి గంగాధర్ ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపరు.

మార్కెట్లలో వడ్డీ రేట్ల ఆశలు..

- సెన్సెక్స్ 614 పాయింట్ల ర్యాలీ

ముంబయి : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వడ్డీ రేట్లు తగ్గించనుందనే అంచనాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు పరుగులు పెట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ ఐటి, ఫార్మా షేర్లు భారీగా లాభపడ్డాయి. కొనుగోళ్ల మద్దతుతో గురువారం బిఎస్ఇ సెన్సెక్స్ 443.79 పాయింట్లు లేదా 0.55 శాతం పెరిగి 81,442కు చేరింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 800 పాయింట్లు పైగా లాభపడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 130.7 పాయింట్లు లేదా 0.53 శాతం లాభంతో 24,751 వద్ద ముగిసింది. రియాల్టీ, ఫార్మా, వైద్య రంగాలు 1.75 శాతం, 1.28 శాతం, 1.07 శాతం చొప్పున పెరిగాయి. లోహ, ఐటి, బ్యాంకింగ్, ఎనర్జీ, ఫైనాన్సియల్ సర్వీసెస్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల సూచీలు రాణించాయి. ఆర్‌బిఐ మూడు రోజుల ద్రవ్య పరపతి విధాన సమీక్ష శుక్రవారంతో ముగియనుంది. ఇందులో మరోమారు వడ్డీ రేట్ల తగ్గింపు ఉండొచ్చని నిపుణులు అంచనాలతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు.

డిఎస్సీ ప్రత్యేకం -ఎస్ఎ/ఎస్‌జిటి



కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

జనరల్ నాలెడ్జ్ : కరెంట్ ఎఫైర్స్

భారతీయ రైల్వేలు-ప్రశ్నలు

1.భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ సెమీ-హై స్పీడ్ ప్రాంతీయ రైలు వ్యవస్థ ఏదీ?
(ఎ) Rapid X (బి) Bullet Fast trast
(సి) Siberian Super fast (డి) Garuda X

2. భారతదేశంలో మొట్టమొదటిసారిగా ప్రయివేట్ రంగంలో నిర్మించబడిన రైల్వే మార్గం ఏది ?
(ఎ) కొంకణ్ (బి) నీలగిరి (సి) మాతరణ్ (డి) డార్జిలింగ్

3.మొట్టమొదటి మీటర్ గేజ్ మార్గం (ఢిల్లీ నుంచి ఫరూక్‌నగర్ వరకు) ఏ సంవత్సరంలో నిర్మించారు?
(ఎ) 1870 (బి)1871 (సి)1872 (డి) 1873

4.ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి రైల్వే మార్గం ఎక్కడ ప్రారంభమైంది?
(ఎ) పుత్తూరు-రేణిగుంట (బి) రాజమండ్రి-కొవ్వూరు
(సి) విశాఖపట్టణం-విజయనగరం
(డి) విజయవాడ-గుంటూరు

5. దక్షిణ మధ్య రైల్వే ఎప్పుడు ప్రారంభించారు?
(ఎ) 1952, ఏప్రిల్ 14 (బి) 1966, అక్టోబర్ 2
(సి) 1958, జనవరి 15 (డి) 1955, ఆగస్టు 1

6.దేశంలో అత్యంత వేగంగా ప్రయాణించే రైలు పేరు?
(ఎ) గతిమాన్ ఎక్స్‌ప్రెస్ (బి) వివేక్ ఎక్స్‌ప్రెస్
(సి) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (డి) దురంతో ఎక్స్‌ప్రెస్

7.భారతదేశంలో మొట్టమొదటి సారిగా భూగర్భ రైల్వేను ఎక్కడ నిర్మించారు?
(ఎ)గోరఖ్‌పూర్ (బి) కోల్‌కొతా (సి) పూణే
(డి) బెంగుళూరు

8.భారత దేశంలో మొట్టమొదటి సంచార రైల్వే ఆసుపత్రి అయిన లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్‌ను ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
(ఎ)1989 (బి) 1990(సి) 1991(డి) 1992

9.భారతదేశంలో మొదటి రైలు మార్గాన్ని ఏ గవర్నర్ జనరల్ కాలంలో ప్రారంభించారు?
(ఎ) లార్డ్ డల్హౌసీ (బి) లార్డ్ రిప్పన్ (సి) లార్డ్ బెంటిక్
(డి) లార్డ్ కారన్‌వాలీస్

10.భారతదేశంలో మొదటి రైల్వే మ్యూజియాన్ని ఏ నగరంలో ఏర్పాటుచేశారు?
(ఎ) చెన్నై (బి) బెంగుళూరు (సి) ముంబై (డి) న్యూఢిల్లీ

11.ప్రపంచంలో అతి ఎత్తైన రైల్వే వంతెనను ఏ రాష్ట్రంలో (చీనాబ్‌నదిపై) ఏర్పాటుచేశారు?
(ఎ) జమ్మూ-కాశ్మీర్ (బి) ఆంధ్రప్రదేశ్ (సి) కేరళ
(డి) మహారాష్ట్ర

12.ప్రపంచంలో తొలి బుల్లెట్ రైలును ప్రారంభించిన దేశం?
(ఎ) భారత్ (బి)జపాన్ (సి) ఇంగ్లాండ్ (డి) రష్యా

13.రైల్వే ఉద్యోగులను భర్తీ చేయటానికి దేశంలో ఎన్ని రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులున్నాయి?
(ఎ) 19 (బి) 20 (సి) 18 (డి) 17

14.ప్రత్యేక రైల్వే బడ్జెట్‌ను మొదటిసారిగా ఎప్పుడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు?
(ఎ) 1920-21 (బి) 1922-23
(సి)1924-25 (డి) 1925-26

15.ప్రస్తుతం పనిచేసే స్థితిలో ఉన్న ప్రపంచంలో అతి పురాతన రైలు ఇంజన్ ?
(ఎ) డక్కన్‌క్వీన్ (బి) ఫెయిరీ క్వీన్
(సి) జీవనరేఖ (డి) మ్యాగ్నటిక్ రైలు



16.భారతదేశంలో అత్యంత దూరం ప్రయాణించే ఎక్స్‌ప్రెస్ ఏదీ?
(ఎ) హిమసాగర్ (బి) వివేక్ (సి) ఎపి (డి) శతాబ్ది

17.భారతదేశంలో మొదటి ఎలక్ట్రికల్ రైలును ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
(ఎ) 1929 (బి) 1930 (సి) 1928 (డి) 1927

18. భారతదేశంలో రైలు మార్గాలు లేని రాష్ట్రాలు ఏవి?
(ఎ) సిక్కిం (బి) మేఘాలయ
(సి) మిజోరాం (డి) పంజాబ్

19. యునెస్కో వారసత్వ జాబితాలో మొట్టమొదట చోటు దక్కించుకున్న భారతీయ రైల్వే ?
(ఎ) డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే
(బి) నీలగిరి మౌంటేన్ రైల్వే
(సి) ఛత్రపతి శివాజీ టెర్మినల్ (డి) కల్కా-సిమ్లా రైల్వే

20. భారతీయ రైల్వే ప్రధాన కార్యాలయం ఎక్కడ కలదు ?
(ఎ) ముంబై (బి) న్యూఢిల్లీ
(సి) బెంగళూరు (డి)సికింద్రాబాద్

21.భారతదేశంలో మొట్టమొదట ఏర్పాటుచేసిన రైల్వే జోన్?
(ఎ) ఉత్తర రైల్వే (బి) దక్షిణ రైల్వే
(సి)ఈశాన్య సరిహద్దు రైల్వే (డి)దక్షిణ మధ్య రైల్వే

22.ప్రపంచంలో అతి పొడవైన రైల్వే ప్లాట్‌ఫామ్ ఎక్కడ కలదు?
(ఎ)గోరఖ్‌పూర్ (బి)ఖరగ్‌పూర్
(సి) కలకత్తా (డి) విజయవాడ

23. ప్రపంచంలో తొలి రైల్వే మార్గాన్ని ఎప్పుడు ఏర్పాటుచేశారు?
(ఎ) 1822 (బి)1823 (సి) 1824 (డి)1825

24.రైల్వే స్టాఫ్ కాలేజ్ ఎక్కడ ఉంది?
(ఎ)లక్నో (ఉత్తరప్రదేశ్) (బి)షిల్లాంగ్ (మేఘాలయ)
(సి) వడోదర (గుజరాత్) (డి) కొచి (కేరళ)

25. దేశంలో అత్యంత తక్కువ దూరం పయనించే రైలు
(ఎ)సంఝౌతా ఎక్స్‌ప్రెస్ (బి) ప్యాలెస్ ఆన్ వీల్స్
(సి) గరీబ్‌రథ్ (డి) ధన్వంతరి


26. హౌరా నుంచి దన్‌బాద్ వరకు మొదటి రెండంతస్తుల రైలు (డబుల్ డెక్కర్)ను ఎప్పుడు ప్రారంభించారు.?
(ఎ) 2011, సెప్టెంబర్ 1 (బి) 2011, అక్టోబర్ 1
(సి) 2011, నవంబర్ 1 (డి) 2011, డిసెంబర్ 1

27. మన దేశంలో అత్యంత పొడవైన రైల్వే వంతెన ఎక్కడ ఉంది?
(ఎ) వల్లార్ పాదమ్ (కేరళ)
(బి) గోదావరి (ఆంధ్రప్రదేశ్) (సి) ససారం (బీహార్)
(డి) మన్వాల్ (జమ్మూ-కాశ్మీర్)

28. ఆసియా, పసిఫిక్ దేశాల మధ్య మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ట్రాన్స్ ఏషియన్ రైల్వే ప్రాజెక్టును ఎప్పుడు ప్రారంభించారు?
(ఎ) 1990 (బి) 1991 (సి) 1992 (డి) 1993

29.పేదలకు, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకే ఎసి సదుపాయంతో 2010లో ప్రారంభించిన రైలు?
(ఎ)గరీబ్‌రథ్ (బి) ధన్వంతరి
(సి) వివేక్ (డి) సంఝౌతా

30.ఐఆర్‌టిసి ఈ-టిక్కెటింగ్‌ను ఎప్పుడు ప్రవేశపెట్టింది?



(ఎ) 2003, డిసెంబర్ 25 (బి)2005, ఆగస్టు 12
(సి) 2008, జూన్ 4 (డి) 2006 ఫిబ్రవరి 18

31.దేశంలో మొట్టమొదటి గ్రీన్ రైల్వే స్టేషన్ ఏర్పాటుచేయబడిన 'మన్వాల్' ఏ రాష్ట్రంలో ఉంది?
(ఎ) జమ్మూ కాశ్మీర్ (బి) మధ్యప్రదేశ్
(సి) ఉత్తరప్రదేశ్ (డి) కర్నాటక

అధ్యయనాలు-ప్రశ్నలు

32. పక్షుల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
(ఎ) జెరంటాలజీ (బి)ఆర్నిథాలజీ
(సి) థియోలజీ (డి) సెలినాలజీ

33.'ఫెలోలజీ' అనగా ఏమిటి?
(ఎ) ఎముకల గురించి అధ్యయనం చేయటం
(బి) నరాల గురించి అధ్యయనం చేయటం
(సి) వాస్తుకళ గురించి అధ్యయనం చేయటం
(డి) భాషలకు సంబంధించిన శాస్త్రం.

34. భూకంపాలను అధ్యయనం చేసే శాస్త్రం ఏది?
(ఎ) ఎకోలజీ (బి) సిస్మాలజీ
(సి) న్యూమిస్ మాటిక్స్ (డి) థియోలజీ

35.'ఎకాలజీ' దేనికి సంబంధించినది?
(ఎ) పక్షుల గురించి అధ్యయనం
(బి) కణజాలాల గురించి అధ్యయనం
(సి) జీవరాశులకు పరిసరాలు, పర్యావరణంతో ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేయటం (డి) ఏదీకాదు

36. మెటీరియోలజీ దేనికి సంబంధించినది?
(ఎ) వాతావరణం (బి) సంఖ్యలు
(సి) లోహాలు (డి) భూకంపాలు

37. క్రిందివాటిలో బాహ్య వాతావరణంలో జీవన విధానాన్ని అధ్యయనం చేయటానికి సంబంధించింది ఏది?
(ఎ) ఎండోబయోలజీ (బి) ఎక్సో బయోలజీ
(సి) ఎంట్రోబయోలజీ (డి)నియో బయోలజీ

38. న్యుమిస్‌మాటిక్స్ అనగా ఏమిటి?
(ఎ) నాణెముల అధ్యయనం (బి) సంఖ్యల అధ్యయనం
(సి) స్టాంపుల అధ్యయనం (డి) అంతరిక్ష అధ్యయనం

39. కూరగాయలు, మొక్కల సాగుపై అధ్యయనం చేయడాన్ని ఏమంటారు?
(ఎ) ఓస్టియోలజీ (బి) ఆర్బోరికల్చర్
(సి) పిసికల్చర్ (డి)ఎటిమాలజీ

40.'అకౌస్టిక్స్' అనగా ఏమిటి?
(ఎ) వాస్తు అధ్యయన శాస్త్రం
(బి) పర్వతాల అధ్యయనం
(సి) ధ్వని అధ్యయనం (డి) శిలాజాల అధ్యయనం

41.చాలా అత్యల్ప ఉష్ణోగ్రతల ఉత్పత్తి, నియంత్రణ మొదలైన వాటిపై అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
(ఎ) యుజెనిక్స్ (బి) క్రయోజెనిక్స్
(సి) సైటాలజీ (డి)హెమటాలజీ

42.నిత్య పచ్చదనం గల భూమి (ల్యాండ్ ఆఫ్ పర్పెట్యువల్ గ్రీనరీ) అని దేనిని పిలుస్తారు?
(ఎ) వెనిజులా (బి) బాల్కన్స్
(సి) జాంజిబార్ (డి) నటల్

43. ఉత్తర ఆస్ట్రేలియాలోని ప్రయరీలను ఏమని వ్యవహరిస్తారు?
(ఎ) వరల్డ్ లోన్లి ఎస్ట్ ల్యాండ్ (బి) నెవర్ నెవర్ ల్యాండ్



(సి) వరల్డ్ బ్రెడ్ బాస్కెట్ (డి) ల్యాండ్ ఆఫ్ విండ్స్‌మిల్స్

44.లవంగాల ద్వీపం (ఐలాండ్ ఆఫ్ క్లోవ్స్) అని దేనిని పిలుస్తారు?
(ఎ) ఆస్ట్రేలియా (బి) బహ్రెయిన్
(సి) జాంజిబార్ (డి) ఐస్‌లాండ్

45. స్వీడన్‌ను ఏ పేరుతో వ్యవహరిస్తారు?
(ఎ) డెయిరీ ఆఫ్ యూరప్ (బి) సామిల్ ఆఫ్ యూరప్
(సి) మదర్ ఇన్ లా ఆఫ్ యూరప్
(డి) ది బ్యాటిల్ ఫీల్డ్ ఆఫ్ యూరప్

46.'ఆధునిక బాబిలోన్' అని ఏ నగరాన్ని పిలుస్తారు?
(ఎ) పారిస్ (బి) న్యూయార్క్ (సి) లండన్ (డి) రోమ్

47. కింది వాటిలో మెక్సికోను ఏ పేరుతో వ్యవహరిస్తారు?
(ఎ) ద స్టోర్ హౌస్ ఆఫ్ ద వరల్డ్
(బి) పెరల్ ఆఫ్ ద పసిఫిక్
(సి) ద సీ ఆఫ్ మౌంటెన్స్ (డి) ల్యాండ్ ఆఫ్ మార్బుల్

48.'బుడాపెస్ట్ ఆఫ్ ఇండియా' అని ఏ భారతదేశ నగరాన్ని పిలుస్తారు?
(ఎ) మైసూరు (బి) చెన్నై (సి) హైదరాబాద్ (డి) లక్నో

49. లాసాను ఏమని పిలుస్తారు?
(ఎ) ఎటర్నల్ సిటీ (బి) ఫర్‌బిడెన్ సిటీ
(సి) గ్రానైట్ సిటీ (డి) సిటీ ఆఫ్ పోప్స్

50.'హెర్మిట్ కింగ్‌డమ్' అని దేనిని పిలుస్తారు?
(ఎ) కొరియా (బి) జపాన్ (సి) తైవాన్ (డి) సింగపూర్

రేపటి సంచికలో : అధ్యయనాలు-ప్రశ్నలు

జవాబులు :
(1)ఎ (2) ఎ (3) సి (4) ఎ (5) బి (6)ఎ (7) బి (8) సి (9) ఎ (10) డి (11) ఎ (12) బి (13) ఎ (14) సి (15) బి (16) బి (17) ఎ (18) ఎ (19) ఎ (20) బి (21) బి (22) ఎ (23) డి (24) సి (25) ఎ (26) బి (27) ఎ (28) సి (29) ఎ (30) బి (31) ఎ (32) బి (33) డి (34) బి (35) సి (36) ఎ (37) బి (38) ఎ (39) బి (40) సి (41) బి (42) డి (43) బి (44) సి (45) బి (46) సి (47) ఎ (48) సి (49) బి (50) ఎ

సంపాదకీయం

పనిగంటల భారం

సంబంధిత శ్రేణులతో ఒక చర్చ, సంభాషణా లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకురావటం తీవ్ర అభ్యంతరకరం, అప్రజాస్వామికం. ఇప్పటికే అనేక రంగాల్లో కార్మికులు అదనపు పనిగంటలతో సతమతమవుతుంటే- అందుకు పరిష్కారం చూపకపోగా- ఆ భారాన్ని మరింత పెంచటం అమానుషం. గతంలో ఉన్న ఉపశమనాలకు, చట్ట రక్షణకు చెల్లుచీటి రాసి, కార్పొరేట్లకు అనుకూలంగా పనిగంటల్లో మార్పులు తీసుకురావడం దుర్మార్గ చర్య. తమ ఏడాది పాలనలో ప్రజలకు అనేక మేళ్లు చేకూర్చామని రాష్ట్ర ప్రభుత్వం ఘనతలు వినిపించిన రోజునే- కార్మిక హక్కులను హరించే కర్కశానికి ఒడిగట్టింది. బుధవారం మంత్రివర్గం చేసిన నిర్ణయాల ప్రకారం ... గతంలో ఉన్న 8 గంటల పనిదినం ఇకపై 12 గంటలకు పెరుగుతుంది. ఐదు గంటల పని తరువాత తీసుకునే అరగంట విశ్రాంతి ఇకపై ఆరుగంటలు పనిచేస్తేనే వర్తిస్తుంది. మూడు నెలల వ్యవధిలో 50 నుంచి 75 గంటలే అదనంగా పనిచేయించవొచ్చు అన్నది గతంలో నిబంధన అయితే- ఇప్పుడది 144 గంటలకు పెరుగుతుంది. రాత్రి వేళల పనిలో మహిళలకు ఎలాంటి మినహాయింపూ ఉండదు. పైగా ఇదేదో పురుషులతో సమంగా పనిచేసే గొప్ప అవకాశంగా, సమానత్వ సూచికగా తలకిందుల తర్కంతో పాలకులు సమర్థించుకోవడం శోచనీయం.

కార్పొరేట్ల కళ్లల్లో సంతోషం చూడడం కోసం కార్మిక హక్కులను పణంగా పెట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పోటీ పడుతున్నాయి. కార్పొరేటు అధిపతులు కొన్నేళ్లుగా వినిపిస్తున్న అధిక పనిగంటల పాటకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పరవశించి తలూపుతోంది. 29 కార్మిక చట్టాలను ఏకపక్షంగా రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తేవడంలోనే దాని కార్పొరేట్ విధేయత స్పష్టంగా కనిపించింది. మానవీయతను, విలువలను తుంగలో తొక్కి లాభాలను కొల్లగొట్టటమే కార్పొరేట్లకు ప్రధానం. నయా ఉదార విధానాలు అమల్లోకి వచ్చిన నాటి నుంచి పాలకుల అండతో కార్పొరేట్ సంస్థలు ఈ నాజూకు దోపిడీని నిరాటంకంగా కొనసాగిస్తున్నాయి. ఫలితంగా 1990- 91 నాటికి 27.64 శాతంగా ఉన్న వేతనాల వాటా 2022-23 నాటికి 15.94 శాతానికి హరించుకుపోయింది. అదే సమయంలో కార్పొరేట్ల నికర లాభాల వాటా 19.06 శాతం నుంచి 51.92 శాతానికి ఎగబాకింది. ఈ వ్యత్యాసపు పర్యవసానం కార్మికుల బతుకుల్లో అప్పులు, అభద్రతతో తీవ్ర అస్తవ్యస్తతకు దారి తీస్తోంది. వేతనాలను పెంచి ఈ సమస్యను సరిదిద్దటానికి బదులు... అందుకు విరుద్ధంగా కార్మికుల చేత మరింత పని చేయించాలని కార్పొరేట్ వర్గం చాలా కాలంగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే యాజమాన్యాలు అప్రకటితంగా రోజుకు నాలుగైదు గంటలు అదనంగా పనిచేయిస్తుంటే- పాలకులు దానిని చట్టబద్ధం చేసి, కార్పొరేట్ భక్తిని చాటుకుంటున్నారు.

వాస్తవానికి అదనంగా పనిచేస్తే అదనపు ఉత్పాదన ఉండదని, అది క్రమేణా మందకొడితనానికి దారి తీస్తుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. పదేళ్ల క్రితం ఐస్‌లాండ్‌లో వారానికి 32 గంటల పనిపద్ధతిని ప్రయోగాత్మకంగా అమలు చేసినప్పుడు మంచి ఫలితాలు వచ్చాయని, ఉద్యోగులు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నారని ఒక అధ్యయనంలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి అనుభవాలు అనేకం ఉన్నాయి. ఆధునిక యంత్రాల వినియోగం, నైపుణ్య పద్ధతులు, సమాచార సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పులు మానవ శ్రమను మరింత తగ్గించాలి. అందుకు విరుద్ధంగా రెండు శతాబ్దాల క్రితం నాటి బండ చాకిరీ దిశగా కార్మికులను మళ్లించటం ఆధునికత అనిపించుకోదు. జీవన రంగాల్లో వచ్చిన వేగం ఇప్పటికే అనేక కొత్త సమస్యలను సృష్టిస్తోంది. క్షణక్షణం లాభాలను సముపార్జించటమే లక్ష్యంగా ఉన్న పెట్టుబడీదారీ వ్యవస్థ ప్రతి మనిషినీ వినియోగదారుని చేసి, నేటి సౌఖ్యం పేరిట రేపటి భవిష్యత్తునూ హరించి వేస్తోంది. బతుకును దినదిన గండంగా, నూరేళ్ల ఇఎంఐల జీవితంగా మార్చేస్తోంది. పని - వికాసం - విశ్రాంతి అన్న మూడెనిమిది గంటల రోజును రూపొందించుకోవటానికి కార్మికవర్గం ఎన్నో పోరాటాలూ, త్యాగాలూ చేసింది. దానిని నిలబెట్టుకోవటం ద్వారానే శారీరకంగా, మానసికంగా, సాంస్కృతికంగా బలమైన సమాజం నిర్మించబడుతుంది. కార్మిక హక్కులను హరించే చట్ట సవరణలను, నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలి. మనుషుల మెరుగైన జీవనానికే శ్రమ తప్ప శ్రమించటం కోసమే మనుషులు కాదన్న సర్వకాలిక సత్యాన్ని గౌరవించాలి.

మంచి మాట




కులం, మతం ప్రాతిపదికగా కాక...సెక్యులరిజం, సమానత్వం ఆధారంగా భారత పౌరులు మెలగాలి.

- మోక్షగుండం విశ్వేశ్వరయ్య,
భారత ఇంజనీరు, పండితుడు, రాజనీతిజ్ఞుడు.

Mokshagundam visvesvaraya

విశ్లేషణ

విద్యుత్ స్మార్ట్ మీటర్ల దోపిడీ



ఈ మీటర్ ద్వారా గంట, గంటకు రీడింగ్ తీయవచ్చు. ఈ టెక్నాలజీని మన జేబులు ఖాళీ చేయటానికి వినియోగిస్తారు. ఏనాడూ మనం చూడని విధంగా.. పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు, వేసవి కాలం ఒక రేటు, చలికాలం మరొక రేటు వసూలు చేయటం దుర్మార్గం కాదా? "టైం ఆఫ్ ది డే" విధానం పేరుతో ఒక రోజుని 4 భాగాలుగా విడగొడతారు. ప్రతి సమయానికి ఒక రేటు నిర్ణయిస్తారు. సాయంత్రం 6 గంటల నుండి 10 గంటల మధ్య ఎక్కువ కరెంటు వినియోగిస్తారు కాబట్టి, ఆ సమయంలో మరింత ఎక్కువ చార్జీలు గుంజుతారు. వేసవి కాలంలో అందరూ ఎక్కువ కరెంటు వినియోగించక తప్పదు. అందుకే ఆ సమయంలో అడ్డగోలుగా రేట్లు వసూలు చేస్తారు. ప్రతిరోజు మన బ్యాలెన్స్‌లో వారు నిర్ణయించిన రేటు ప్రకారం డబ్బు కట్ అయిపోతూ ఉంటుంది.



సిహెచ్. బాబూరావు

విద్యుత్ నేడు నిత్యవసరంగా, అత్యవసరంగా మారిపోయింది. అందుకే ప్రతి రోజు, ప్రతి గంట, ప్రతి మనిషిని, ప్రతి పనిలోనూ దోపిడీ చేయడానికి వీలుండే విద్యుత్‌పై పాలకులు, కార్పొరేట్ల చూపు పడింది. అందులో భాగంగానే ప్రభుత్వ అండతో అదానీ సంస్థ సిబ్బంది మీ ఇంటికి విద్యుత్ స్మార్ట్ మీటర్ బిగించడానికి వస్తున్నారు. తస్మాత్ జాగ్రత్త!

మీటరు.. కథా కమామిషు..

బాగున్న డిజిటల్ మీటర్లను తొలగించి ప్రజల కళ్ళుగప్పి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. ముందు ప్రభుత్వ కార్యాలయాలకు, ఆ తదుపరి షాపులు, పరిశ్రమలు, సంస్థలకు బిగించారు. ఇప్పుడు నివాస గృహాలకు పెడుతున్నారు. వినియోగదారుల ముందస్తు అనుమతి లేకుండా, మోసపూరిత మాటలతో, బెదిరింపులతో మీటర్లు బిగిస్తున్నారు. ఆదానీ కంపెనీకి మీటర్ల ఏర్పాటు, పదేళ్ల పాటు నిర్వహణ డి.బి.ఎఫ్.ఒ.ఒ.టి (డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఓన్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో కాంట్రాక్టును కట్టబెట్టారు. తొలి దశలో 41 లక్షల కనెక్షన్లకు మీటర్లు పెడుతున్నారు. దశలవారీగా రాష్ట్రంలోని రెండు కోట్ల మంది వినియోగదారులకు మీటర్లు బిగిస్తారు. ఇది మీటర్ మార్పు మాత్రమే కాదు. విధానం మార్చే కుట్ర ఇందులో ఇమిడి ఉంది. విద్యుత్ రంగాన్ని బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రైవేటీకరణకు ఇది ఒక మెట్టు. దీని పేరే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్. సెల్‌ఫోన్ తరహాలో ముందుగానే డబ్బు చెల్లించి చార్జింగ్ చేయించుకోవాలి. అప్పుడే కరెంటు వస్తుంది. ముందు రూ.500 తగ్గకుండా బ్యాలెన్స్ వేయించుకోవాలి. బ్యాలెన్స్ అయిపోగానే మళ్ళీ డబ్బు చెల్లించి రీచార్జి చేయించుకోవాలి. లేనియెడల కరెంటు నిలిచిపోతుంది. చీకటే గతి. ప్రస్తుతం నెల తర్వాత రీడింగ్ తీస్తారు. బిల్లు ఇస్తారు. 15 లేదా నెల రోజుల లోపు బిల్లు కట్టవచ్చు. ఇప్పుడు ముందే బిల్లు కట్టాలి. పెట్టుబడి పెట్టాలి. అందరికీ ఇది భారమే. ఇక ఇంటికి వచ్చి రీడింగ్ తీయరు. బిల్లు ఇవ్వరు. కంపెనీవారే ఆన్‌లైన్‌లో బిల్లు పంపుతారు. తప్పులు వచ్చినా సమాధానం చెప్పే నాథుడు ఉండరు. జవాబుదారీతనం ఉండదు. ఎప్పుడు, ఎంత రేటు వసూలు చేస్తారో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ప్రీపెయిడ్ పద్ధతితో దేశంలో రూ.23 లక్షల కోట్లు ముందుగానే జనం నుండి బడా కంపెనీలు వసూలు చేస్తాయని ఒక అంచనా.

అంతా మోసమే

ఈ మీటర్ ద్వారా గంట, గంటకు రీడింగ్ తీయవచ్చు. ఈ టెక్నాలజీని మన జేబులు ఖాళీ చేయటానికి వినియోగిస్తారు. ఏనాడూ మనం చూడని విధంగా.. పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు, వేసవి కాలం ఒక రేటు, చలికాలం మరొక రేటు వసూలు చేయటం దుర్మార్గం కాదా? "టైం ఆఫ్ ది డే" విధానం పేరుతో ఒక రోజుని 4 భాగాలుగా విడగొడతారు. ప్రతి సమయానికి ఒక రేటు నిర్ణయిస్తారు. సాయంత్రం 6 గంటల నుండి 10 గంటల మధ్య ఎక్కువ కరెంటు వినియోగిస్తారు కాబట్టి, ఆ సమయంలో మరింత ఎక్కువ చార్జీలు గుంజుతారు. వేసవి కాలంలో అందరూ ఎక్కువ కరెంటు వినియోగించక తప్పదు. అందుకే ఆ సమయంలో అడ్డగోలుగా రేట్లు వసూలు చేస్తారు. ప్రతిరోజు మన బ్యాలెన్స్‌లో వారు నిర్ణయించిన రేటు ప్రకారం డబ్బు కట్ అయిపోతూ ఉంటుంది.

సింగిల్ ఫేజ్ మీటర్‌కు రూ.8,927 త్రీ ఫేజ్ మీటర్‌కు రూ.17,286 అదానీ కంపెనీకి జనం చెల్లించాలి. జిల్లాలను బట్టి రేట్లు తేడాలు ఉంటాయి. మళ్లీ నిర్వహణ ఖర్చులు, అదనపు పరికరాల ఖర్చులు కూడా కలపవచ్చు. ప్రజల కళ్ళు కప్పి 93 నెలలలో వాయిదాల పద్ధతిలో నుండి వసూలు చేస్తారు. రాష్ట్రంలోని రెండు కోట్ల మీటర్లకు దాదాపు రూ.25 వేల కోట్ల భారం జనం నెత్తిన పడుతుంది. బాగున్న పాత మీటర్లు వృథాగా పడేస్తారు. మీటర్లు తయారు చేసేది, బిగించేది, నిర్వహించేది సర్వం అదానీ కంపెనీదే. వారిని బాగు చేయటానికి మన ఇళ్లల్లో మీటర్లు పెట్టడానికి అంగీకరించాలా?

విద్యుత్.. సమర్పయామి!

ఈ స్మార్ట్ మీటర్లు ఎ.ఎం.ఐ (అడ్వాన్స్‌డ్ మీటర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్), ఎ.ఎం.ఆర్ (ఆటోమేటిక్ మీటర్ రీడింగ్) టెక్నాలజీ తో ఉంటాయి. మన ఇంటిలోని స్మార్ట్‌మీటర్‌కు, అదానీ కంపెనీకి వైర్‌లెస్ ద్వారా అనుసంధానం చేస్తారు. కంట్రోల్ మొత్తం ప్రైవేటు సంస్థ చేతిలో ఉంటుంది. విద్యుత్ వినియోగాన్ని, డబ్బు వసూళ్లను వారే నియంత్రిస్తారు. పెత్తనం మొత్తం వారిదే. రిమోట్ ద్వారా ఆపరేట్ చేయవచ్చు. ఏ అక్రమానికైనా పాల్పడవచ్చు. మన బిల్లు ఎంతైనా పెంచేయవచ్చు. మన రీడింగ్‌ను అడ్డగోలుగా మార్చవచ్చు. మనం చేయగలిగేదేమీ ఉండదు. ఇప్పటికే టెలి సంస్థలు రిలయన్స్, ఎయిర్‌టెల్ తదితర కంపెనీలు రకరకాల ప్యాకేజీలతో ఇష్టారాజ్యంగా రేట్లు పెంచేస్తున్నాయి. ఫిర్యాదులపై స్పందన ఉండదు. రేపు కరెంటు గతీ అంతే.

ఇంతే కాదు విద్యుత్ ఉత్పత్తి ఇప్పటికే సగభాగం బడా కంపెనీల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ఇప్పుడు పంపిణీ కూడా అదానీ వంటి బడా కంపెనీలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, నిర్వహణ ద్వారా ప్రవేశిస్తాయి.

మన సొమ్ముతో ప్రభుత్వం వేసిన విద్యుత్ లైన్లు, స్తంభాల నుండి ప్రైవేట్ కంపెనీలు మనకు విద్యుత్ సరఫరా చేస్తాయి. స్మార్ట్ మీటర్లు బిగిస్తాయి. బిల్లులు వసూలు చేసుకుంటాయి. వినియోగదారులకే కాదు, ఉద్యోగులకు కూడా భద్రత, రక్షణ ఉండవు.

ప్రధాన దోషి బిజెపి-తోడు దొంగలు టిడిపి, వైసిపి

కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు దోచిపెడుతోంది. ప్రభుత్వ సంస్థలను తెగనమ్ముతోంది. అందులో భాగంగానే విద్యుత్ రంగంలోనూ సంస్కరణలను ప్రవేశపెట్టింది. కరోనా వంటి కష్ట కాలంలోనూ ఈ సంస్కరణల అమలుకు కర్కశంగా పూనుకున్నది. కేంద్ర విద్యుత్ చట్టానికి సవరణలు చేయడానికి పూనుకుంటున్నది. చట్టం మార్పులు చేయక ముందే నిబంధనలను అడ్డగోలుగా మార్చేసింది. ఆత్మ నిర్భర్ భారత్ పేరుతో అప్పులు, నిధులు ఎరచూపి రాష్ట్ర ప్రభుత్వాలను లొంగదీసుకున్నది. నాటి వైసిపి, జగన్ ప్రభుత్వం ప్రమాదకర సంస్కరణలను గుడ్డిగా ఆమోదించింది. నేడున్న టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం.. గత వైసిపి ప్రభుత్వ బాటలోనే మోడీ కనుసన్నల్లో సాగుతోంది. దేశంలోని వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లు మూడు సంవత్సరాల్లో బిగించాలని 2021 ఆగస్టు 17న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీచేసింది. విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణ, ఉచిత విద్యుత్ పథకాల తొలగింపు, పేదలకు తక్కువ రేటుకి విద్యుత్ అందించే క్రాస్ సబ్సిడీ విధానం రద్దు, అందరికీ ఒకటే స్లాబ్, స్మార్ట్ మీటర్లు బిగించాలని కేంద్రం తాఖీదులు ఇచ్చింది. అందుకు ఆర్డిఎస్-ఎస్ (రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పాపాలకు ప్రధాన బాధ్యత కేంద్రం, బిజెపి, మోడీదే. నాటి వైసిపి, బిజెపి ప్రభుత్వాలు కుమ్మక్కు అయ్యి రాష్ట్రంలోని 18 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగింపుకు రంగం సిద్ధం చేశారు. ఒక్కొక్క మీటరు ఖర్చు, నిర్వహణ కలిపి రూ.35 వేల రేటు నిర్ణయించారు. ఇదొక భారీ కుంభకోణం. అదానీకి, తమ బినామీ కంపెనీ షిరిడి సాయి ఎలక్ట్రికల్ సంస్థలకు రూ.13,252 కోట్ల కాంట్రాక్టులు కట్టబెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆగ్రహించారు. ఇక గత్యంతరం లేని స్థితిలో పంపు సెట్లకు మీటర్లబిగింపు తాత్కాలికంగా ఆగింది. దొడ్డి దారిన మరో రూపంలో ఉచిత విద్యుత్ కు ఎసరు పెట్టటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వ్యవసాయానికే కాకుండా నివాస గృహాలకు, షాపులకు, సంస్థలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వైసిపి పాలనలోనే గుట్టు చప్పుడు కాకుండా టెండర్లు పిలిచారు. తొలి దశలో 41 లక్షల మీటర్లు బిగించడానికి అదానీకి కాంట్రాక్టులు కట్టబెట్టారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని నాడు లోకేష్ యువ గళం పాదయాత్రలో పిలుపునిచ్చారు. టిడిపి నేతలు హైకోర్టులో కేసులు వేశారు. నేడు అదే టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం మీటర్లను బిగించడం మోసపూరితం, నమ్మకద్రోహం.

స్మార్ట్ మీటర్లపై పాలకులు, అధికారులు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. ముందు కార్యాలయాలకే అన్నారు. ఆ తర్వాత షాపులతో ఆగుతుందన్నారు. ఇప్పుడు ప్రతి ఇంటికి బిగిస్తున్నారు. అయితే ప్రజలను మోసం చేయటానికి ముందుగా అమృత్ పథకం అమలు జరుగుతున్న నగరాలకే పరిమితం అని, కొన్ని జిల్లాలలో 200 యూనిట్ల పైన వినియోగించే ఇళ్ళకే బిగిస్తామని, మరికొన్ని చోట్ల అపార్ట్‌మెంట్ల వరకే పెడతామని...ఇలా పలు రకాల మాటలతో వంచిస్తున్నారు. గతంలో 18 లక్షల వ్యవసాయ పంపుసెట్ల మీటర్లకు, నేడు 41 లక్షల నివాసాల మీటర్లకు కాంట్రాక్టులు ఇచ్చారు. తరువాత దశలవారీగా ప్రతి ఇంటికి మీటర్ బిగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు ఇచ్చాయి. నాడు వైసిపి, నేడున్న కూటమి ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు విద్యుత్ నియంత్రణ మండలి నిబంధనలు, రెగ్యులేషన్‌లకు సవరణలు చేసింది (గెజిట్ నంబర్ 921, 923, 924 తేదీ.25-2-2025). అందులో ప్రతి ఇంటికి మీటర్ బిగించాలని పేర్కొన్నారు. మీటర్ బిగించి తొలుత పాత పద్ధతిలోనే బిల్లులు వసూలు చేస్తారు. అన్ని ఇళ్లకు బిగించిన తర్వాత ప్రీపెయిడ్ పద్ధతి అమల్లోకి వస్తుంది. మీటర్ ఉచితమని నమ్మబలుకుతున్నారు. కానీ 93 వాయిదాలలో నెలవారీ బిల్లులలో వసూలు చేసుకునే ఒప్పందాలు అయిపోయాయి. మీటర్ ఖర్చు వినియోగదారుడే భరించాలని లేదా అద్దె రూపంలో వసూలు చేయాలని సవరించిన నిబంధనలలో స్పష్టంగా పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ చోరీ ఆగుతుందని, విద్యుత్ నష్టాలు తగ్గుతాయని, బిల్లుల ఎగవేత ఆగుతుందని చెప్పే మాటలన్నీ బూటకమే. బడా సంస్థలకు, కొత్తగా పెట్టే కంపెనీలకు విద్యుత్ రాయితీలు ప్రభుత్వాలు ప్రకటించాయి. తక్కువ రేటుకు వీరికి విద్యుత్ ఇస్తారు. స్మార్ట్ మీటర్ల వలన ఆదాయం పెరిగేది అదానీకి, కార్పొరేట్లకు మాత్రమే. నష్టపోయేది మాత్రం ప్రజలే.

అంతే లేని బాదుడు

ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య జనం గగ్గోలు పెడుతున్నారు. కరెంటు చార్జీలు పెంచేది లేదని, బాదుడు ఆపుతామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. 9 నెలల్లోనే రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీల భారం మోపింది. 4 రకాల అదనపు సర్దుబాటు చార్జీలు, 2019, 22, 23, సంవత్సరాల్లో వినియోగించిన కరెంటుపై మళ్లీ అదనంగా బాదుతున్నారు. ఈ బాదుడుకి స్మార్ట్ మీటర్ల దోపిడీ తోడయ్యింది. విద్యుత్ రంగం ప్రభుత్వం చేతిలో ఉంటే అడగటానికైనా అవకాశం ఉంటుంది. అదాని వంటి బడా కంపెనీల చేతిలోకి వెళితే మనం ప్రశ్నించే అవకాశం కోల్పోతాం.

ఈ భారాలకు కారణం మీరంటే, మీరని వైసిపి, తెలుగుదేశం పార్టీలు ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నాయి. ఈ భారాలకు, స్మార్ట్ మీటర్ల బాగోతానికి, అదాని, కార్పొరేట్ల దోపిడీకి బాధ్యత..బిజెపి, టిడిపి, జనసేన, వైసిపి అందరిది. వీరందరూ దోషులే. 7 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని ఆదానీ సంస్థకు "సెకి" సంస్థ ద్వారా కట్టబెట్టారు. రూ.1750 కోట్ల జగన్ ప్రభుత్వం లంచాలు తీసుకుని ఈ ఒప్పందం చేసిందని అమెరికా కోర్టులో సాక్ష్యాధారాలతో విచారణ జరుగుతున్నది. అయినా చంద్రబాబు ప్రభుత్వం జగన్, అదానీ పైన కనీసం కేసు కూడా పెట్టలేదు. చర్యలు తీసుకోలేదు. ఈ ఒప్పందం వలన రాబోయే 25 ఏళ్లలో రూ.లక్షా 20 వేల కోట్ల భారం ప్రజలపై పడుతుందని చెప్పిన చంద్రబాబు ఈ అక్రమ ఒప్పందాన్ని కొనసాగించటం సిగ్గుచేటు. టిడిపి, జనసేన, వైసిపి, బిజెపి కుమ్మక్కయ్యాయి. తమ అవినీతిని కాపాడుకుంటున్నారు. అదానీని రక్షిస్తున్నారు. ప్రజలను పీడించుకు తింటున్నారు. వీరందరిదీ ఒకటే దారి.

పోరాటమే మార్గం

ఇలా భరించాల్సిందేనా? మరో మార్గం లేదా? కచ్చితంగా మార్గం ఉంది. ప్రజలందరూ చైతన్యవంతులు అవ్వాలి. స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే ఉమ్మడిగా ఎదుర్కోవాలి. తిప్పి కొట్టాలి. రైతులు తిరగబడితే పంపు సెట్లకు మీటర్లు ఆగాయి. ఢిల్లీలో రైతులు పోరాడితే కేంద్ర విద్యుత్ చట్టానికి సవరణలు ఆగాయి. పలు రాష్ట్రాలలో విద్యుత్ ఉద్యోగులు పంపిణీ ప్రైవేటీకరణపై సమ్మెలు, ఆందోళనలు చేయగా ప్రభుత్వాలు వెనకంజ వేశాయి. రాష్ట్రంలో పోరాడితే చెత్త పన్ను రద్దయింది. ముందే మేలుకుందాం. స్మార్ట్ మీటర్లను అడ్డుకుందాం. ఇళ్లకు స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం ఆపాలి. షాపులకు, సంస్థలకు పెట్టిన మీటర్లు తొలగించాలి. సర్దుబాటు చార్జీల భారం రద్దు చేయాలి. విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలి. ప్రజా వ్యతిరేక సంస్కరణలు ఆపాలి. విద్యుత్ ప్రమాదాలపై తొలి నుండి సిపిఎం, వామపక్షాలు పోరాడుతున్నాయి. ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందు ఉంచుతున్నాయి. భారాలపైన, స్మార్ట్ మీటర్ల పైన, ప్రమాదకర విధానాలపైన పోరాడుతున్న సిపిఎం, వామపక్షాలకు, ప్రజాసంఘాలకు అండగా నిలుద్దాం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు/

వ్యాఖ్య

'మేడిన్ చైనా' విడిభాగాల కోసం బారులు తీరుతున్నాం...!


సత్య

మన ఆటోమొబైల్ పరిశ్రమ చైనా నుంచి రావాల్సిన ఒక చిన్న పరికరం కారణంగా ప్రస్తుతం ఆందోళన చెందుతోందంటే ఎవరైనా నమ్ముతారా? అదే నియోడిమియమ్ ఐరన్ బోరోన్ అనే మాగ్నెట్. కార్లలో స్టీరింగ్ నుంచి బ్రేకులు, వైపర్లు, ఆడియో పరికరాల వంటి వాటికి ఇది ఎంతో ముఖ్యం. అది లేకపోతే మొత్తం కారు సిద్ధమైనా ప్రయోజనం ఉండదు. వాటి తయారీ, సరఫరాలో గుత్తాధిపత్యం ఉన్న చైనా ఏప్రిల్ నుంచి ఎగుమతుల మీద పలు ఆంక్షలు విధించింది. వాటిని దేనికి వినియోగిస్తారో ముందుగానే ఆయా దేశాలు హామీ పత్రాలు ఇవ్వాలన్నది వాటిలో ఒకటి. కొన్ని దేశాలు వాటిని కొని... చైనాతో వైరానికి దిగిన అమెరికా, ఐరోపా దేశాలకు అమ్ముకుంటున్నాయి. దాన్ని నిరోధించేందుకే ఆ షరతు అన్నది స్పష్టం. మన దేశంలో గతంలో దిగుమతి చేసుకున్న నిల్వలు జూన్ మొదటి వారం వరకు వస్తాయని అందువలన త్వరగా తెచ్చుకొనేందుకు చైనాతో సంప్రదింపులు (పైరవీలు) జరపాలని ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ సొసైటీ, ఆటోమోటివ్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు చైనా వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారని 'బిజినెస్ టుడే' పత్రిక (2025 మే 31) పేర్కొన్నది. 2024లో 470 టన్నుల మాగ్నెట్‌లు దిగుమతి చేసుకోగా ఈ ఏడాది 700 టన్నులకు నిర్ణయించారు. చైనా మీద ఆధారపడకుండా మనమే మాగ్నెట్‌లు తయారు చేసేందుకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వాలో నిర్ణయించేందుకు జూన్ 3న ఉన్నత స్థాయి కమిటీ సమావేశాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు కూడా ఆ పత్రిక రాసింది. చేతులు కాలాక ఆకులు పట్టుకోవటం అంటే ఇదే! పదకొండు సంవత్సరాల నుంచి ఏం చేసినట్లు?

'లోకల్ సర్కిల్స్' సంస్థ 2025 ఏప్రిల్ 25వ తేదీన తన సర్వే నివేదికను ప్రచురించింది. అందులో చెప్పిన ప్రకారం గడచిన ఏడాది కాలంలో భారతీయుల్లో 62 శాతం మంది చైనా వస్తువులను కొనుగోలు చేశారు. అంతకు ముందు ఏడాది వారు 55 శాతమే ఉన్నారు. 15 శాతం మంది చైనా నుంచి కొత్త వస్తువులు భారతీయ కంపెనీల ద్వారా వస్తే కొనుగోలు చేయటం ఖాయమని చెప్పారు. ఈ వివరాలు సూచిస్తున్న దేమిటి? స్వదేశీ వస్తువులనే వాడండి అని పాలకులు ఎన్ని సుభాషితాలు పలికినప్పటికీ జనం పట్టించుకోవటం లేదు. మా వెనుకే జనం ఉన్నారని చెప్పుకుంటున్న పార్టీ మాటలు విని ఉంటే చైనా దిగుమతులు పడిపోయేవి. దానికి విరుద్ధంగా మోడీ ఏలుబడిలో రికార్డులు బద్దలవుతున్నాయి.

రాజకీయంగా అమెరికాతో అంటకాగేందుకు కేంద్ర పాలకులు తపించి పోతుంటారు. కాషాయ దళాలు నిత్యం చైనా, కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొడుతుంటాయి. కానీ ఆర్థిక విషయాల్లో మాత్రం చైనా కావాల్సి వస్తోంది. నరేంద్ర మోడీ అధికారం స్వీకరించగానే 2014లో చెప్పిందేమిటి? మేకిన్ ఇండియా పథకంతో దేశాన్ని ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా మారుస్తా, అందుకు అవసరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తానన్నారు. ఉత్పత్తితో ముడిపెట్టిన ప్రోత్సాహక పథకం (పిఎల్ఐ) ప్రకటించారు. జిడిపిలో ఉత్పాదక రంగ వాటాను 15 నుంచి 2025 నాటికి 25 శాతానికి పెంచుతానని, కీలక రంగాల్లో చైనా మీద ఆధారపడటాన్ని తగ్గిస్తా అని చెప్పారు. అందుకు దేశమంతటా గుజరాత్ నమూనా అభివృద్ధి చేస్తా అన్నారు. పదేళ్లలో జరిగిందేమిటి? కొంత మేరకు ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతుల విలువ పెరిగింది. జిడిపిలో వస్తూత్పత్తి వాటా పెరగకపోగా 14 శాతానికి తగ్గింది. దీని గురించి మాట్లాడకుండా సెల్ ఫోన్ల ఎగుమతి చూడండి, యాపిల్ కంపెనీ 20 శాతం ఉత్పత్తి ఇక్కడే చేస్తున్నది అంటూ సర్వస్వం అదే అన్నట్లుగా చిత్రిస్తున్నారు. పిఎల్ఐ స్కీములో కేటాయించిన 1.9 లక్షల కోట్ల రూపాయల సబ్సిడీ దీనికి ఒక కారణం. టెలికమ్యూనికేషన్స్, పివి సెల్స్ వంటి కొన్ని దిగుమతులు చైనా నుంచి తగ్గాయి. కానీ ఔషధ రంగానికి అవసరమైన ఏపిఐ దిగుమతులు 75 నుంచి 72 శాతానికి మాత్రమే తగ్గాయి. అనేక రంగాలకు ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను సాధించటంలో వైఫల్యం కనిపిస్తుంది. మొత్తంగా విజయమా, వైఫల్యమా అన్నది చూడాలి. యాపిల్ కంపెనీని ఒక ఉదాహరణగా చూపుతున్నారు. చైనాలో ఉత్పాదక ఖర్చు పెరిగిన కారణంగా అది వియత్నాం, మన దేశానికి వచ్చింది. అమెరికాలో తడిచి మోపెడవుతుంది గనుక ఎన్ని పన్నులు వేసినా విదేశాల్లోనే తయారు చేస్తానని ట్రంప్‌కు తెగేసి చెప్పింది. సీ జిన్‌పింగా, నరేంద్ర మోడీనా, ట్రంపా, ఎల్లయ్యా, పుల్లయ్యా అన్నది కాదు. దానికి కావాల్సింది లాభాలు. రేపు ఆఫ్రికా ఖండంలో ఖర్చు తక్కువగా ఉంటే పోలోమంటూ అక్కడికి పోతుంది. ఆ కంపెనీ చైనాలో విశ్వవిద్యాల యాలు, పరిశోధనా సంస్థలు, విడిభాగాలు తయారు చేసే పరిశ్రమలతో సమగ్ర ఒప్పందాలు చేసుకుంది. మన దేశంలో అలాంటివేమీ లేదు.

వాజ్‌పేయి పాలనలో దేశం వెలిగిపోయిందని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఆ పాలన ముగిసి యుపిఎ అధికారానికి వచ్చిన రెండేళ్లకు 2006లో నేషనల్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంపిటీటివ్ కౌన్సిల్ ఉత్పాదక రంగం సంక్షోభంలో ఉందని, జాతీయ ఉత్పాదక విధానాన్ని రూపొందించాలని కోరింది. దానికి అనుగుణంగా 2011లో యుపిఎ సర్కార్ పదేళ్లలో జిడిపిలో ఉత్పాదక రంగ వాటాను పెంచేందుకు ఒక విధానాన్ని ఆమోదించింది. నరేంద్ర మోడీ అధికారానికి వచ్చిన తరువాత 2014లో దానికి మేకిన్ ఇండియా అనే పేరు తగిలించి తానే రూపొందించినట్లు ప్రచారం చేసుకున్నారు. దాన్లో భాగంగానే సబ్సిడీలకు ప్రోత్సాహకాల పేరుతో కొత్త పేరు పెట్టి 2020లో పిఎల్ఐ స్కీమును ఐదేళ్ల ప్రణాళికతో ప్రకటించారు. దాని గడువు ముగిసినప్పటికీ లక్ష్యాలను సాధించకపోవటంతో పొడిగించాలని నిర్ణయించారు. చిత్రం ఏమిటంటే గాల్వన్ లోయ ఉదంతాల తరువాత దేశభద్రతకు ముప్పు అనే పేరుతో పరోక్షంగా చైనా పెట్టుబడులను నిషేధించిన మోడీ సర్కార్



అద్భుతం...! కానీ ఈ చిన్న అక్షరాలు చూస్తే 'మేడ్ ఇన్ చైనా' అని తెలుస్తోంది!

ఈ స్కీము కింద ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో చైనా కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టి సబ్సిడీలు పొందవచ్చని నిర్ణయించింది. అయితే దానికి మన దేశంలో ఉన్న ఏదైనా కంపెనీతో సంయుక్త భాగస్వామ్యంలో 49 శాతం వాటాకు పరిమితం కావాలని, యాజమాన్యం భారతీయ కంపెనీల చేతుల్లో ఉండాలని, సాంకేతిక పరిజ్ఞాన బదిలీలు జరగాలని షరతు పెట్టింది (ఫైనాన్సియల్ ఎక్స్‌ప్రెస్ 2025 ఏప్రిల్ 28). వేగంగా పని చేస్తానని చెప్పుకొనే మోడీ సర్కార్‌కు ఈ నిర్ణయం తీసుకొనేందుకు పదేళ్లు పట్టింది, చివరకు పెట్టుబడిదారుల ఒత్తిడి పని చేసినట్లు కనిపించి, ఏదైతే అదవుతుందని సందిగ్ధావస్థ నుంచి బయటపడినట్లు ఉంది.

పోనీ ఈ పదేళ్లలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులేమైనా కేటాయించిందా? గత మూడు పారిశ్రామిక విప్లవాల బస్సులను ఎక్కలేకపోయామని నరేంద్ర మోడీ చెప్పింది నిజమే, కానీ నాలుగో బస్సును ఎక్కటానికి చేసిందేమిటి అన్నది ప్రశ్న. జిడిపిలో అమెరికా 2.8, చైనా 2.1, దక్షిణ కొరియా 4.2, ఇజ్రాయిల్ 4.3 శాతం ఖర్చు చేస్తుంటే మన ఖర్చు పదేళ్లలో 0.6 నుంచి 0.7 శాతం

ఎంతసేపూ ఆవు పేడలో, మూత్రంలో బంగారం ఉందా, ఏముంది అనే ఆత్రంతో పరిశోధనల మీద ఉన్న కేంద్రీకరణ మిగతా వాటి మీద లేదు. ఇందువల్లనే మనదంటూ చెప్పుకొనేందుకు హిందూత్వ తప్ప ఒక్క వస్తువు బ్రాండైనా లేదు. చైనా నుంచి కంపెనీలు వస్తున్నాయదిగో చూడండి, ఇదిగో చూడండి, అంటూ ఇంట్లోకి గేటు బయటకు తిరిగి చూసినట్లు తప్ప స్వంత కంపెనీల ఏర్పాటు గురించి పట్టించుకోలేదు. రిలయన్స్, ఇతరులకు చమురు తవ్వకం ఇచ్చారు. పదేళ్ల నాటికీ ఇప్పటికీ స్వంత ఉత్పత్తి తగ్గింది తప్ప పెరగలేదు.

మధ్య ఉందంటే మోడీ దేశాన్ని ఎంత వెనక్కు తీసుకుపోయారో అర్థం అవుతోంది. ఎంతసేపూ ఆవు పేడలో, మూత్రంలో బంగారం ఉందా, ఏముంది అనే ఆత్రంతో పరిశోధనల మీద ఉన్న కేంద్రీకరణ మిగతా వాటి మీద లేదు. ఇందువల్లనే మనదంటూ చెప్పుకొనేందుకు హిందూత్వ తప్ప ఒక్క వస్తువు బ్రాండైనా లేదు. చైనా నుంచి కంపెనీలు వస్తున్నాయదిగో చూడండి, ఇదిగో చూడండి, అంటూ ఇంట్లోకి గేటు బయటకు తిరిగి చూసినట్లు తప్ప...స్వంత కంపెనీల ఏర్పాటు గురించి పట్టించుకోలేదు. రిలయన్స్, ఇతరులకు చమురు తవ్వకం ఇచ్చారు. పదేళ్ల నాటికీ ఇప్పటికీ స్వంత ఉత్పత్తి తగ్గింది తప్ప పెరగలేదు.

పదకొండేళ్ల మోడినోమిక్స్ తీరుతెన్నులు చూసినపుడు కొన్ని ధోరణులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎండమావుల వెంట నీళ్ల కోసం పరుగెత్తినట్లుగా ఆధునిక టెక్నాలజీ కోసం మన దేశం అమెరికా వైపు చూస్తోంది. ఇంధనం, ఆయుధాల కోసం రష్యా మీద, చౌకగా వచ్చే వస్తువుల కోసం చైనా మీద ఆధారపడినట్లు కనిపిస్తోంది. ఇలా ఎంతకాలం అన్నది ప్రశ్న. చైనా వస్తువుల మీద ఆధారపడిన అమెరికా, ఇతర ఐరోపా దేశాలు నేర్చుకున్న గుణపాఠం మనవారు నేర్చుకోవటానికి సిద్ధంగా లేరు. అందుకు నిదర్శనం పరిశోధన-అభివృద్ధి కేటాయింపులను నిర్లక్ష్యం చేయటమే. మనదంటూ ఒక ప్రత్యేకత లేకపోతే సమగ్ర స్వయం సమృద్ధి అనేది పగటి కలే!

★

టారిఫ్‌లపై జిన్‌పింగ్‌తో ట్రంప్ ఫోన్ సంభాషణ

బీజింగ్ : అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్‌తో గురువారం ఫోన్ ద్వారా సంభాషించారు. ఇరు దేశాల మధ్య నిలిచిపోయిన టారిఫ్‌ల గురించి చర్చించారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ మీడియా సంస్థ జిన్హువా వెల్లడించింది. చర్చల వివరాలను వెల్లడించలేదు. అమెరికా-చైనా మధ్య గత నెల 12న సుంకాల తగ్గింపు ఒప్పందం కుదిరిన తరువాత ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు నిలిచిపోయాయి. 'జిన్‌పింగ్ అంటే నాకు చాలా ఇష్టం. కానీ ఆయనతో ఒప్పందం కుదుర్చుకోవడం చాలా కష్టం' అని ట్రంప్ బుధవారం వ్యాఖ్యానించారు. కీలకమైన ఖనిజాలను చైనా ఎగుమతి చేయడం లేదని అమెరికా ఆరోపిస్తుంది. చర్చలకు వీలుగా ట్రంప్ చైనా వస్తువులపై 145 శాతం సుంకాలను 90 రోజుల పాటు 30 శాతానికి తగ్గించారు. చైనా కూడా అమెరికా వస్తువులపై తన పన్నులను 125 శాతం నుండి 10 శాతానికి తగ్గించింది.

ఒడిషాలో బాక్సైట్‌పై నిరసనలు

రాయగఢ్ నుంచి మేధాపాట్కర్‌ను వెనక్కి పంపిన పోలీసులు



రాయగఢ్ రైల్వే స్టేషన్‌లో మేధాపాట్కర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

భువనేశ్వర్ : ఒడిషాలోని రాయగఢ్ జిల్లాలో సిజిమాలి రిజర్వ్ వద్ద బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి. ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వ వేలం ద్వారా బాక్సైట్ తవ్వకాల అనుమతులను వేదాంత గ్రూప్ దక్కించుకుంది. బాక్సైట్ తవ్వకాలు తమ జీవనోపాధిని, పర్యావరణాన్ని దెబ్బతీస్తాయని గిరిజనులు, గ్రామస్తులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. మైనింగ్ నిర్వహించవద్దని డిమాండ్ చేస్తూ గత రెండేళ్లుగా సిజిమాలి సమీపంలో ప్రజలు నిరసన తెలుపుతున్నారు. వాటిని పట్టించుకోకుండా ప్రభుత్వం మైనింగ్ హక్కులను వేదాంతకు కట్టబెట్టింది. మైనింగ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని అణచివేయడానికి పోలీసు బలంతో బిజెపి సర్కారు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే ఈ నెల నాలుగు నుంచి రెండు నెలల పాటు 24 మంది ఉద్యమకారులు రాయగఢ్ జిల్లాలో ప్రవేశించకుండా జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా ఎటువంటి నిరసనలు, ధర్నాల్లో పాల్గొనకుండా నిషేధం విధించారు. బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా జిల్లాలోని కాశీపూర్‌కు సమీపంలోని సుంగర్ హాడిపాడి వద్ద మా మాతి మాలి సురక్ష మంచ్ ఆధ్వర్యంలో జరిగిన సభకు నిర్వాహకులు నిర్ణయించారు. ఈ సభకు హాజరు కాకుండా చేయడానికి జిల్లా కలెక్టర్ పై ఉత్తర్వులు జారీ చేశారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ ఉత్తర్వుల అమల్లో భాగంగానే గురువారం తెల్లవారుజామున రాయగఢ్ చేరుకున్న ప్రముఖ ఉద్యమవేత్త మేధాపాట్కర్‌తోపాటు ఇతరులను రైల్వే స్టేషన్‌లో పోలీసులు అడ్డుకుని, వెనక్కి పంపారు. జిల్లాలో వీరు పర్యటిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు చెప్పారు.

బిజెపి ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది : మేధాపాట్కర్

'ప్రకృతి నిజమైన సంరక్షకులైన ఆదివాసీల ఆహ్వానం మేరకు పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రేమికులు ఒడిషా సందర్శించడానికి రాష్ట్రంలోని ప్రస్తుత బిజెపి ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది?' అని మేధాపాట్కర్ ప్రశ్నించారు. రాయగఢ్ నుండి ఎక్స్‌లో మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడారు. 'గురువారం తెల్లవారుజామున మేము రైలు దిగగానే, పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది మమ్మల్ని ఆపి, రైల్వే స్టేషన్ నుండి బయటకు వెళ్లడానికి అనుమతి లేదని చెప్పారు. మేము నేరస్తులం కాదు. పర్యావరణాన్ని కాపాడటం యొక్క ప్రాముఖ్యత గురించి మాట్లాడటానికి రాయగఢ్ వచ్చామని చెప్పినా పోలీసులు వినలేదు' అని అన్నారు. తరువాత కొన్ని గంటల్లోనే తోటి కార్యకర్తలు లింగరాజ్, నరేంద్ర మొహంతితో కలిసి మేధాపాట్కర్ వెనక్కి వెళ్లిపోయారు. ఒడిషాలోని కలహండి, రాయగఢ, కోరాపుట్ జిల్లాలోని తూర్పు కనుమల కొండ శ్రేణులు బాక్సైట్ ఖనిజ నిల్వలతో సమృద్ధిగా ఉన్నాయి. వేదాంతతో పాటు, అదానీ గ్రూప్, ఆదిత్య బిర్లా గ్రూప్ వంటి ప్రైవేట్ సంస్థలు ఈ ఖనిజంపై కన్నేశాయి. ఇప్పటికే మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశాయి.

కౌలు రైతుల సమస్యలపై 11న 'చలో మంగళగిరి'

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'అన్నదాతా.. సుఖీభవ ' పథకాన్ని ప్రతి కౌలురైతుకు వర్తింపచేయాలని, భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ఈ నెల '11వ తేదీన ఛలో మంగళగిరి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు తెలిపారు. విజయవాడలోని ఎంబివికెలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి పార్టీలు కౌలు చట్టాన్ని రద్దు చేస్తామని, భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడానికి కొత్త కౌలు చట్టం తీసుకువస్తామని ప్రకటించాయని తెలిపారు. అన్నదాతా.. సుఖీభవ పథకంలో రూ.20 వేలును ప్రతి కౌలు రైతులకు అందజేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లోనూ వ్యవసాయ శాఖ మంత్రి ఈ విషయాన్ని స్పష్టంగా ప్రకటించారని వివరించారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, కౌలు ఒప్పందాలు పూర్తయినా కొత్త కౌలు చట్టం, గుర్తింపు కార్డుల మంజూరు వంటి అంశాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 11వ తేదీన 'చలో మంగళగిరి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సిసిఎల్, వ్యవసాయ శాఖ కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి పంచికర్ల రంగారావు మాట్లాడుతూ.. ఈ ఏడాది మిరప, పొగాకు, కొకొ, మినుము, ఇతర అనేక పంటల ధరలు పడిపోయినా, ప్రభుత్వం ఒక్క రూపాయి బోనస్ ప్రకటించలేదన్నారు. పొగాకు కంపెనీల చేత పంటలను కొనుగోలు చేయించకపోవడంతో పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ సమావేశంలో సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి పల్లె కృష్ణ, ఎన్‌టిఆర్ జిల్లా నాయకులు మాతంగి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థుల ప్రవేశం నిలిపివేత

- హార్వర్డ్ పై ట్రంప్ నిర్ణయం



వాషింగ్టన్ : విదేశీ విద్యార్థులకు ఆరు నెలల పాటు వీసాలను నిలిపివేయాలని హార్వర్డ్ విశ్వ విద్యాలయాన్ని ఆదేశిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమ వలసల ను, యూదు వ్యతిరేక సంఘటనలను నివారి ంచేం దుకు ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రకటిం చారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అంతర్జాతీయ విశ్వవిద్యాలయం (ఐఎయు) కార్యా లయ గణాంకాల ప్రకారం హార్వర్డ్ యూనివర్శిటీలో 150 దేశాలకు చెందిన 10,158 మంది విద్యార్థులు చదువుతుండగా, వారిలో 2,126 మంది చైనా విద్యార్థులు. గణనీయంగా ఉన్న భారతీయ విద్యార్థులకు కూడా ఇది ఆందోళనకరమేనని విశ్లేషకులు అంటున్నారు. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించినందుకు ప్రతీకార చర్యగా హార్వర్డ్ విశ్వవిద్యాలయం అభివర్ణించింది. ఈ ఉత్తర్వుల అమలుకు న్యాయస్థానాలు అనుమతించాల్సి ఉంది. ఈ చర్య అమెరికా ప్రతిష్టను, అంతర్జాతీయ విశ్వసనీయతను దెబ్బతీస్తుందని చైనా విమర్శించింది. విద్యలో రాజకీయ జోక్యాన్ని చైనా ఎల్లప్పుడూ వ్యతిరేకిస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ అన్నారు.

12 దేశాలపై ట్రావెల్ బ్యాన్!

12 దేశాలకు చెందిన పౌరులు అమెరికా రాకుండా నిషేధిస్తూ ట్రంప్ మరో నిర్ణయం తీసుకున్నారు. ఇది సోమవారం నుండి అమల్లోకి రానుంది.ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్, చాడ్, కాంగో రిపబ్లిక్, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్ దేశాలను పూర్తిగా నిషేధించారు. బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్క్మెనిస్తాన్, వెనుజులా దేశాలకు టూరిస్ట్ వీసాలు, స్టూడెంట్ వీసాలు నిలిపివేసింది. వీటిపై పాక్షిక ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఉగ్రవాదం పేరుతో ఆఫ్ఘనిస్తాన్ని నిషేదించి పాకిస్తాన్ పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ప్రశాంతంగా ముగిసిన ఎపి ఎడ్‌సెట్ పరీక్ష

- 21న ప్రవేశ పరీక్ష ఫలితాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలలో బిఇడి కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఎపి ఎడ్‌సెట్ 2025 ప్రవేశ పరీక్ష గురువారం సజావుగా ముగిసిందని ఎపి ఎడ్‌సెట్-2025 కన్వీనర్ ఆచార్య ఎవివిఎస్ స్వామి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 87 ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఈ ప్రవేశ పరీక్షకు 17,795 మంది దరఖాస్తు చేసుకోగా, 14,609 మంది పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఆన్సర్ కీని ఈ నెల 10న విడుదల చేస్తామని, ఏమైనా సందేహాలు ఉంటే ఈ నెల 13వ తేదీలోగా నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. ఎపి ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలను ఈ నెల 21న విడుదల చేస్తామని తెలిపారు. వర్సిటీలోని ఆన్‌లైన్ కేంద్రాన్ని ఆయన సందర్శించి పరీక్ష జరుగు తీరును పరిశీలించి, పర్యవేక్షించారు. కన్వీనర్ ఆచార్య ఎవివిఎస్ స్వామి తోపాటు ఆచార్య బ్రహ్మాజీరావు, ఆచార్య తులసీదాస్ తదితరులు ఉన్నారు.

దేవినేని అవినాష్‌కు ఊరట

ప్రజాశక్తి-అమరావతి

తిరువూరు పోలీసులు పెట్టిన నాలుగు కిడ్నాప్ కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ పిటిషన్ వేసిన వైసిపి నేత దేవినేని అవినాష్‌కు హైకోర్టులో వెసులుబాటు లభించింది. బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశిస్తూ జస్టిస్ కుంచెం మహేశ్వరరావు గురువారం ఆదేశించారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని తిరువూరు నగర పంచాయతీ ఎన్నిక సందర్భంగా 20వ వార్డు కౌన్సిలర్ షేక్ నదియా, ఆమె భర్తను దేవినేని అవినాష్, తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి స్వామిదాస్ నిర్బంధించారని ఈ కేసు నమోదైంది. నదియా బావ షేక్ మస్తాన్ గత నెల 20న ఫిర్యాదు చేశారు. రాజకీయ కారణాలతోనే తప్పుడు కేసు బనాయించారని, బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) నోటీసు ఇచ్చి వివరణ తీసుకునేలా పోలీసులను ఆదేశించాలంటూ అవినాష్ తరపు న్యాయవాది వాదించారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతివాదన చేస్తూ, సెక్షన్ 35(3) నోటీసు జారీ చేస్తామని చెప్పడంతో అందుకు అనుగుణంగా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

సజ్జల సోదరుల భూమి వ్యవహారంలో స్టేటస్ కో కొనసాగింపు

ప్రజాశక్తి-అమరావతి

కడప జిల్లా సీకేదిన్నె మండల పరిధిలో వైసిపి నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి సోదరుల కుటుంబ సభ్యులకు చెందిన 63.72 ఎకరాల భూమి వ్యవహారంలో యథాతథస్థితి (స్టేటస్ కో)ను ఈ నెల 30 వరకూ కొనసాగించాలని హైకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్లు చెబుతున్న 63.72 ఎకరాల భూమి విషయంలో అధికారులు ఇప్పటికే పంచనామా నిర్వహించి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమి అటవీ భూమని పేర్కొంటూ కడప కలెక్టర్ జారీ చేసిన భూస్వాధీన ప్రొసీడింగ్స్ అమలును సజ్జల కుటుంబసభ్యులు హైకోర్టులో సవాల్ చేశారు. ప్రొసీడింగ్స్‌ను నిలుపుదల చేస్తూ, కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీకి ముందున్న యథాతథస్థితిని కొనసాగించాలని ఇటీవల సింగిల్ జడ్జి ఆదేశించారు. ఆ మధ్యంతర ఉత్తర్వులను పాక్షికంగా సవరిస్తూ జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ టి. చంద్ర ధనశేఖర్ డివిజన్ బెంచ్ ఉత్తర్వులను జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

పిపిపిలో పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- వైభవంగా మసులా బీచ్ ఫెస్ట్ ప్రారంభం



మసులా బీచ్ ఫెస్టివల్ వద్ద ప్రజల సందడి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాష్ట్రంలో పిపిపి పద్ధతిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో గేట్ వే ఆఫ్ అమరావతి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న మసులా బీచ్ ఫెస్ట్ గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 974 కిలోమీటర్ల సముద్ర తీరం ఉందని, ఈ ప్రాంతాలను పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ముందుకు వెళ్తున్నామని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ఇప్పటి వరకు పది నుండి పదిహేను కంపెనీలతో అవగాహన ఒప్పందం చేసుకున్నామన్నారు. మంగినపూడి బీచ్ అభివృద్ధికి కూడా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అభివద్ధికి సంబంధించి డిపిఆర్ తయారు చేసి పంపించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గేట్ వే ఆఫ్ అమరావతిగా బందరును మార్చేందుకు ఈ ఫెస్ట్ ద్వారా అడుగులు వేశామని తెలిపారు. ఎన్నో అవకాశాలు ఉన్న మంగినపూడి బీచ్‌ని అభివద్ధి చేయడానికి స్వదేశీ దర్శన్ కింద రూ.వంద నుండి రూ.150 కోట్లు ఖర్చు చేస్తే భవిష్యత్తులో ఏడాదికి రూ.వెయ్యి కోట్ల నుండి, రూ.1500 కోట్ల వరకు ఆదాయ వనరులు సమకూరుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్ రాజా, ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కృష్ణా జిల్లా కలెక్టర్ డికె బాలాజీ పాల్గొన్నారు.

'మై ఎస్ఎస్‌సి' మొబైల్ యాప్

న్యూఢిల్లీ: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) అభ్యర్థుల కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను విడుదల చేసింది. ఇకపై ప్రతీ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు మొబైల్ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు గురువారం ఎస్ఎస్‌సి ఛైర్మన్ ఎస్ గోపాలకష్ణన్ తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులకు ఈ అప్‌గ్రేడ్ చేసిన 'మై ఎస్ఎస్‌సి యాప్' ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఇందులో మెరుగైన ఇంటర్‌ఫేస్‌ను పొందుపరచినట్లు తెలిపారు. అభ్యర్థులు దీనిని ద్వారా సులభతరంగా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ యాప్‌ను ప్రజల్లోకి తీసుకొని వెళ్లడానికి తగు చర్యలు చేపట్టనున్నారని తెలిపారు.

24 గంటల్లో 1,238 కొత్త కరోనా కేసులు..

ఢిల్లీ : దేశంలో కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్యశాఖ వివరాల ప్రకారం.. 24 గంటల్లోనే 1,238 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. ఒక్క రోజులో కరోనాతో ఏడుగురు మృతి చెందారు. భారత్‌లో ప్రస్తుతం 4,866 యాక్టివ్ కేసులు ఉన్నాయి. మహారాష్ట్రలో ముగ్గురు, ఢిల్లీలో ఇద్దరు, కర్నాటకలో కరోనాతో ఇద్దరు మృతి చెందారు.

సోషల్ మీడియాను నియంత్రించాలి

- బాధ్యతల స్వీకరణలో మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్



మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆలపాటి సురేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోషల్ మీడియాను అవసరమైన సందర్భాల్లో నియంత్రించాల్సిన అవసరం ఉందని సి రాఘవాచారి మీడియా (ప్రెస్) అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ అన్నారు. మీడియా అకాడమీ కార్యాలయంలో గురువారం ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సరైన సమాచారాన్ని పొందడంలో సోషల్ మీడియా నియంత్రణ కూడా ఒక భాగమే అని చెప్పారు. అకాడమి పరిధిలో లేకపోయినా, ఈ విషయంపై దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. పాత్రికేయ వృత్తిలో ప్రమాణాలు మెరుగు పరిచేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేష్‌కుమార్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎపిడబ్ల్యూజెఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు, ఐజెయు జాతీయ కార్యదర్శి డి సోమసుందర్, ఎపియుడబ్ల్యూజె నాయకులు, తదితరులు కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి మణిరాం, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్ స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్ పి కిరణ్‌కుమార్, సమాచార శాఖమంత్రి అదనపు పిఎస్ అనిత తదితరులు పాల్గొన్నారు.

యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ

- ఎపిఎస్ఎస్‌డి చైర్మన్ శేషారావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోనున్నట్లు ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు తెలిపారు. తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో ఛైర్మన్‌గా ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ.. యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా చేయడమే నైపుణ్యాభివృద్ధి సంస్థ లక్ష్యమన్నారు. స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా ప్రభుత్వ, పారిశ్రామిక, విద్యా రంగాలు సమన్వయంతో పని చేస్తాయన్నారు. ప్రతి జిల్లాలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మహిళల కోసం ప్రత్యేక నైపుణ్య కార్యక్రమాలు, గ్రామీణ యువత కోసం డిజిటల్ ఇంటర్న్‌షిప్ మొదలైన కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేష్ మార్గదర్శకత్వంలో పనిచేస్తామన్నారు. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే లక్ష్యంతో మహిళలకు, గ్రామీణ యువతకు, టెక్నాలజీకి దూరంగా ఉన్న వారందరికీ ఇంటింటికీ నైపుణ్యాన్ని తీసుకెళ్లే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ శేషారావును వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎమ్‌డి, సిఇఒ గణేష్ కుమార్, ఇడి, విద్యారంగానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

కూటమి వైఫల్యాలపై రౌండ్‌టేబుల్ సమావేశాలు

- వైసిసి కోఆర్డినేటర్ సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలపై వైసిపి పోరాటాలకు కొనసాగింపుగా ఉమ్మడి జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు పార్టీ ముఖ్య, జిల్లా నాయకులతో గురువారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. పార్టీ నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని తెలిపారు. సమావేశాల్లో కీలక రంగాలను కూటమి ప్రభుత్వం ఏ విధంగా నాశనం చేసిందనేది చర్చించాలన్నారు. ప్రభుత్వ అరాచకాలు, వైఫల్యాలపై చర్చను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. విద్యార్థులు, మహిళలు, యువత, రైతులు ప్రతి ఒక్కరికీ సంబంధించిన సమస్యలపై సమావేశాల్లో చర్చించాలన్నారు. రెడ్‌బుక్ పాలన పేరుతో చేస్తున్న అరాచకాలన్నీ బయట పెట్టాలని కోరారు. ఉమ్మడి 13 జిల్లా కేంద్రాల్లో తప్పనిసరిగా ఈ సమావేశాలు జూన్ నెలాఖరులోగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయా రంగాల్లో నిష్ణాతులు, మేధావులు, సివిల్ సొసైటీ సభ్యులు, విశ్రాంత అధికారులు, సోషల్ వర్కర్స్, రైతు సంఘం నాయకులు, తటస్థులందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వేంపల్లి సతీష్‌రెడ్డి, పూడి శ్రీహరి, గండికోట శ్రీకాంత్ రెడ్డి, పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అన్ని సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గురువారం నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ మహాసభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉందని, కూటమి ప్రభుత్వం ఆ పరిస్థితిని చక్కదిద్ది ఒకటో తేదీనే జీతాలు అందిస్తుందన్నారు. ఉద్యోగుల సమస్యలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని అన్నారు. ప్రభుత్వంతో చర్చించి ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. పరిపాలనలో ఉద్యోగుల పాత్ర కీలకమైందని తెలిపారు. ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించిన ఉద్యోగ సంఘం నాయకులకు అభినందనలు తెలిపారు. ఉద్యోగులు, ప్రభుత్వం పరస్పర సహకారంతో పని చేసి పాలనను మరింత ప్రజామోదంగా తీర్చిదిద్దుదామని సూచించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగులకు మేలు చేయాలన్న తపనతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య సమస్యల సమన్వయం ఎన్‌టిఆర్ హయాం నుంచి ట్రిబ్యునల్ ఉండేదన్నారు. గత ప్రభుత్వం దీనిని రద్దు చేసిందని, ట్రిబ్యునల్‌ను పునరుద్ధరించే అంశాన్ని సిఎంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ సందర్భంగా ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు మంత్రికి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, అసోసియేషన్ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ మస్క్‌ల మధ్య మాటల యుద్ధం

- నిరాశతో ఉన్నా : అమెరికా అధ్యక్షుడు
- నేను లేకుండా మీరు గెలిచేవారా..? : టెస్లా సంస్థ అధినేత

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, టెస్లా సంస్థ అధినేత ఎలన్ మస్క్‌ల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది.

'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్' పై ఎలన్ మస్క్ చేసిన తీవ్ర విమర్శలపై అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గురువారం నిరాశ వ్యక్తం చేశారు. బిల్లులోని కీలక నిబంధనల గురించి - ముఖ్యంగా ఎలక్ట్రిక్ వెహికల్ (ఇవి) ఆదేశంలో ప్రతిపాదిత కోత గురించి టెస్లా సిఇఒకి ముందే తెలుసని అన్నారు. ఓవల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్, "నేను ఎలన్ పట్ల చాలా నిరాశ చెందాను. నేను అతనికి చాలా సహాయం చేసాను. బిల్లు యొక్క అంతర్గత పనితీరు ఇక్కడ కూర్చున్న వారందరి కంటే ఆయనకు బాగా తెలుసు. ఆయనకు దానితో ఎటువంటి సమస్య లేదు. అకస్మాత్తుగా ఆయనకు ఒక సమస్య వచ్చింది . మేం ఇవి వాహనాలపై ఇచ్చిన ఆదేశాలను తగ్గించబోతున్నామని తెలుసుకున్నప్పుడు సమస్య పెరిగింది." అని వివరించారు.

ఇవిల కోసం ఫెడరల్ కన్స్యూమర్ టాక్స్ క్రెడిట్‌ను దశలవారీగా తొలగించాలనే 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్' ప్రణాళిక నుంచి మస్క్ వ్యతిరేకత వచ్చిందని అధ్యక్షుడు ట్రంప్ అన్నారు, ఇది టెస్లాను నేరుగా ప్రభావితం చేస్తుంది. ట్రంప్ ఇలా అన్నారు 'చూడండి, ఎలన్ .. మీతో నాకు చాలా మంచి సంబంధం ఉంది. భవిష్యత్తులో కూడా మన మధ్య మంచి సంబంధం ఉంటుందో లేదో నాకు తెలియదు. నా గురించి మంచి విషయాలు చెప్పాడు. అతను నా గురించి వ్యక్తిగతంగా చెడుగా ఏమీ అనలేదు. అదే తర్వాత విషయం అవుతుంది. కానీ నేను చాలా నిరాశ చెందాను. 'ఈ బిల్లు ప్రభావం యూఎస్ స్టాక్ మార్కెట్‌లో టెస్లా స్టాక్‌పై కూడా కనిపించింది. నాస్‌డాక్‌లో గురువారం టెస్లా షేర్లు 8.44 శాతానికి పడిపోయాయి, గత రెండు-మూడు రోజుల్లో, ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేసే ఎలన్ మస్క్ యొక్క ఈ కంపెనీ స్టాక్ 28 డాలర్లు పడిపోయింది.

ట్రంప్ వాదనలన్నీ తప్పే..

ఎక్స్ పోస్ట్‌లో మస్క్, 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్' గురించి డోనాల్డ్ ట్రంప్ వాదనలన్నీ తప్పు అని పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా ఆయన ఇలా రాశారు, 'అసలు ఈ బిల్లులో ఏముందో.. నాకు ఒక్కసారి కూడా చూపించలేదు. కాంగ్రెస్‌లో దాదాపు ఎవరూ దానిని చదవలేని విధంగా రాత్రి చీకటిలో చాలా త్వరగా ఆమోదించారు.' మరొక పోస్ట్‌లో, మస్క్ ఇలా అన్నాడు: 'ఏమైనా సరే. చమురు, గ్యాస్ సబ్సిడీలను తాకకపోయినా, ఇవి, సోలార్ ప్రోత్సాహకాలను బిల్లులో ఉంచండి (చాలా అన్యాయం!!).' అని కోరారు.

నేను లేకుండా ట్రంప్ ఎన్నికల్లో గెలవలేదు: మస్క్

ఎలోన్ మస్క్ ఒక వినియోగదారుకు ప్రత్యుత్తరం ఇస్తూ, 'నేను లేకుంటే, ట్రంప్ ఎన్నికల్లో ఓడిపోయేవాడు, డెమొక్రాట్లు సభను నియంత్రించేవారు . రిపబ్లికన్లు సెనేట్‌లో 51-49 సీట్లు కలిగి ఉండేవారు.' ట్రంప్ కృతజ్ఞత లేనివాడు అని మస్క్ అభివర్ణించారు.

అబద్ధపు ప్రచారాలు చేస్తున్న కార్పొరేట్ కళాశాలలు

- అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్పొరేట్ కళాశాలల అక్రమ ప్రచారాలను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో గురువారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్రకార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఈ నెల జూన్ 2వ తేది జెఇఇ అడ్వాన్స్ ఫలితాలు విడుదలైన తరువాత కార్పొరేట్ కళాశాలలు తప్పుడు ప్రచారాలు చేశాయని చెప్పారు. ఆలిండియా మూడో ర్యాంకు సాధించిన మజిద్ ముజహిద్ హుసేన్ మధ్యప్రదేశ్‌లోని మాక్రో విషన్ అకాడమిలో శిక్షణ పొందారని, కానీ చైతన్య, నారాయణ కళాశాలల్లో చదివినట్లు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. 6వ ర్యాంకు సాధించిన అక్షత్ కుమార్ అలీన్ అకాడమీలో చదివారని తెలిపారు. చైతన్య, నారాయణలలో చదవని వారిని తామే చదివించామని రెండు కళాశాలలు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటమని విమర్శించారు. అడ్డగోలుగా అబద్ధపు ప్రచారాలు చేస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. కార్పొరేట్ కళాశాలల్లో 8వేల వరకు అడ్మిషన్లు తగ్గడంతో అబద్ధపు ప్రచారాల ద్వారా లబ్ధి పొందాలనే ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ కళాశాలలు ఆత్మహత్యలకు నిలయాలుగా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఇలాంటి కళాశాలల్లో చేర్పించొద్దని విజ్ఞప్తి చేశారు. అబద్ధపు ప్రచారాలను ప్రభుత్వం అడ్డుకొని కళాశాలపై క్రిమినల్ కేసులు బనాయించాలని, లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు కుమార్ స్వామి, మాధవ్, నాయకులు ప్రణీత, షణ్ముక్ తదితరులు పాల్గొన్నారు.

గాజాలో కాల్పులు విరమించండి

- ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానం
- ఏకపక్షంగా ఆరోసారి వీటోచేసిన అమెరికా



భద్రత మండలి సమావేశం నిర్వహించిన దృశ్యం

న్యూయార్క్ : గాజాలో బేషరతుగా, శాశ్వతంగా తక్షణమే కాల్పుల విరమణ జరపాలని డిమాండ్ చేస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి చేసిన తీర్మానాన్ని అమెరికా బుధవారం ఏకపక్షంగా తోసిపుచ్చింది. ఇందుకు తన వీటో అధికారాన్ని ఏకంగా ఆరోసారి ఉపయోగించు కుంది. తద్వారా మానవతా సంక్షోభాన్ని పరిష్కరించాలన్న విజ్ఞప్తులను పెడచెవిన పెట్టింది. భద్రతా మండలిలోని పది తాత్కాలిక సభ్య దేశాలు ఈ తీర్మానాన్ని రూపొందించాయి. హమాస్ అదుపులో వున్న బందీలను వెంటనే విడుదల చేయాలని కూడా ఆ తీర్మానం డిమాండ్ చేసింది.

మానవతా సాయంపై విధించిన ఆంక్షలన్నింటినీ ఎత్తివేయాలని, గాజాలో అత్యవసర సేవలను అందించాలని తీర్మానం కోరింది. ఇజ్రాయిల్ నరమేధంపై నేరుగా, కఠినంగా విమర్శించకుండానే, పరుషమైన పదజాలం లేకుండా తీర్మానాన్ని రూపొందించినప్పటికీ అమెరికా వీటో చేసింది. పైగా కతార్, ఈజిప్ట్, అమెరికా నేతృత్వంలో జరుగుతున్న దౌత్య ప్రయత్నాలకు కూడా ఐరాస మద్దతిచ్చింది. అయినా అమెరికా ఆ తీర్మానాన్ని వ్యతిరేకించింది. హమాస్‌ను ఖండించడంలో విఫలమైన ఏ చర్యకూ అమెరికా మద్దతివ్వబోదని ఐరాసలో అమెరికా రాయబారి డొరొతి షా అన్నారు. హమాస్ ఆయుధాలను అప్పగించి, గాజా నుండి వైదొలగాలని డిమాండ్ చేశారు. గాజాలో యుద్ధం మొదలైనప్పటి నుండి చిన్నారులు, మహిళలుసహా సాధారణ ప్రజానీకంపై ఇజ్రాయిల్ పాల్పడుతున్న మారణహోమానికి అడ్డుకట్ట వేయాలని కోరుతూ రూపొందించిన తీర్మానాలన్నింటినీ అమెరికా వీటో చేస్తోంది. ఇజ్రాయిల్‌కు సాంప్రదాయ మిత్రదేశాలైన ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలు కూడా అంతర్జాతీయంగా ఎదురవుతున్న ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుని తమ వైఖరిని మార్చుకుని కాల్పుల విరమణకు డిమాండ్ చేస్తున్నాయి. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా, గాజా ఆహార పంపిణీ కేంద్రాలపై ఇజ్రాయిల్ దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. హింసను అంతమొందించాలని, గాజాలో ప్రజల ఇబ్బందులను నివారించాలని అంతర్జాతీయంగా వస్తున్న విజ్ఞప్తులను తోసిరాజని అమెరికా, ఇజ్రాయిల్‌కు నిరంతరంగా మద్దతును, దౌత్యపరమైన తోడ్పాటును అందిస్తూనే వస్తోంది. ఈ తరుణంగా పాలస్తీనియన్లకు బాసటగా నిలిచి, వారికి సంఘీభావం ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా వుందని మానవ హక్కుల కార్యకర్తలు పేర్కొంటున్నారు.

పుతిన్, ట్రంప్ ఫోన్ కాల్!

మాస్కో : అమెరికా, రష్యా అధ్యక్షులు ట్రంప్, పుతిన్‌లు బుధవారం ఫోన్‌కాల్‌లో మాట్లాడుకున్నారని క్రెమ్లిన్ సహాయకుడు తెలిపారు. ఉక్రెయిన్ అంశంపై చర్చించిన ఇరువురు నేతలు ఇటీవల భారత్, పాక్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల గురించి కూడా మాట్లాడుకున్నట్లు క్రెమ్లిన్ సహాయకుడు, విదేశాంగ విధానాలపై పుతిన్ సలహాదారు కూడా అయిన యూరి ఉష్‌కొవ్ మీడియాకు తెలిపారు. పశ్చిమాసియాలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై కూడా వారు సవివరంగా చర్చించారని రష్యా వార్తా సంస్థ టాస్ తెలిపింది. ఉష్‌కొవ్ ఆ వివరాలను వెల్లడించలేదు. రష్యన్ వైమానిక స్థావరాలపై ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడులపై పుతిన్‌తో చర్చించినట్లు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో బుధవారం పోస్టు పెట్టారు. దాదాపు గంటకు పైగా సాగిన ఈ సంభాషణ బాగా జరిగిందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరుపక్షాల మధ్య ఇటీవల జరిగిన ఇతర దాడులపై కూడా ప్రస్తావన వచ్చిందన్నారు. ఇటీవల తమ వైమానిక స్థావరాలపై ఉక్రెయిన్ జరిపిన దాడులకు కచ్చితంగా తగు రీతిలో స్పందిస్తామని పుతిన్ స్పష్టం చేసినట్లు ట్రంప్ తెలిపారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న ప్రత్యక్ష చర్చలను దెబ్బతీయడానికి కీవ్ ప్రయత్నించిందని పుతిన్, ట్రంప్‌కు తెలియచేశారని ఉష్‌కొవ్ తెలిపారు. ఆ చర్చలకు ముందు రోజే రష్యా స్థావరాలపై దాడి జరిగింది.

రాష్ట్రపతి, గవర్నర్లు రాజ్యాంగానికి అతీతులు కాదు

ఐలు జాతీయ అధ్యక్షులు బికాస్ రంజన్ భట్టాచార్య



సదస్సులో మాట్లాడుతున్న బికాస్ రంజన్ భట్టాచార్య, చిత్రంలో కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రపతి, గవర్నర్లు రాజ్యాంగానికి అతీతులు కాదని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ అధ్యక్షుడు, ఎంపి బికాస్ రంజన్ భట్టాచార్య అన్నారు. ఐలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'గవర్నర్ల తీరుపై సుప్రీం కోర్టు తీర్పు - రాష్ట్రపతి రిఫరెన్స్ ఆర్టికల్ 143(1), సమాఖ్య వ్యవస్థపై దాడి' అనే అంశంపై విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన బిల్లుల విషయంలో గవర్నర్ల కాలయాపనపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా ఉండేందుకు భారత రాష్ట్రపతి 14 ప్రశ్నలను లేవనెత్తారని పేర్కొన్నారు. రాష్ట్రపతి లేవనెత్తిన ప్రశ్నలన్నిటికీ సుప్రీంకోర్టు తన తీర్పులోనే జవాబు చెప్పిందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్లు ఆయా ప్రభుత్వాలు చేసే చట్టాలను వీలైనంత త్వరగా ఆమోదించాలన్నారు. రాజ్యాగం స్వాతంత్రోద్యమం నుంచి పుట్టిన రాజకీయ, సామాజిక, న్యాయ బద్ధ గ్రంధమని తెలిపారు. అలాంటి గ్రంధాన్ని నేటి బిజెపి ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధపడటం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత తరుణంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అందరూ సంసిద్ధం కావాలని కోరారు. విజయవాడ లా కళాశాల డీన్ సిహెచ్.బెనర్జీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం, ఉప రాష్ట్రపతి సుప్రీం కోర్టును జ్యూడీషియల్ టెర్రరిస్ట్‌గా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ రాష్ట్రాల పరిపాలనతో అంతరాయాలు కలిగిస్తున్నారని చెప్పారు. సదస్సులో ప్రసంగించిన వక్తలు అందరూ సుప్రీం కోర్టు బిల్లుల ఆమోదంలో గవర్నర్లకు విధించిన కాలపరిమితి సరైందేననే అభిప్రాయం వ్యక్తం చేశారు. సదస్సుకు ఐలు ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు అధ్యక్షత వహించగా, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, సిద్ధార్థా న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ పి.దివాకర్ బాబు, ఐలు రాష్ట్ర అధ్యక్షులు కె.విజయకుమార్ తదితరుల పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

- సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నైరుతి రుతుపవన కాలంలో సంభవించే తుఫానులు, వరదల వంటి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖలు తగిన కార్యాచరణతో సర్వ సన్నద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి రుతుపవనాల ఆగమనం సందర్భంగా వివిధ శాఖల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్‌ను ఆయన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ.. నైరుతి రుతుపవన కాలం ఇప్పటికే మొదలైనందున రాబోయే రోజుల్లో అధిక వర్షాలు, తుఫానుల కారణంగా ఎదురయ్యే విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు శాఖల వారీగా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సర్వసన్నద్ధమై ఉండాలని స్పష్టం చేశారు. అధిక వర్షాలకు నదులు, వాగులు, వంకలు పొంగి వరదలు సంభవించే పరిస్థితులు తలెత్తే అవకాశాలను ముందుగానే అంచనా వేయాలని, ఇందుకు సంబంధించి వాసర్ ల్యాబ్స్‌తో సమన్వయం చేసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ, తదితర శాఖల అధికారులను ఆదేశించారు.

భారత్‌తో చర్చలు జరిపేందుకు అవకాశం కల్పించాలి

- ట్రంప్‌ను కోరిన పాక్ నేతలు


ఇస్లామాబాద్ : భారత్, పాక్‌ల మధ్య ఇటీవల తలెత్తిన ఉద్రిక్తతలను నివారించడంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పోషించిన పాత్రను పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) చీఫ్ బిల్వాల్ భుట్టో జర్దారి ప్రశంసించారు. బుధవారం జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో వారు ట్రంప్‌ను ప్రశంసించారు. భారత్‌తో సమగ్రంగా చర్చలు జరిపేందుకు అవకాశం కల్పించేలా చూడాల్సిందిగా వారు ట్రంప్‌ను కోరారు. అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకోవడంపై కూడా వారు మాట్లాడారు. పాకిస్తాన్‌తో ఘర్షణలను నివారించేలా చూడడంలో తాను కీలకంగా వ్యవహరించానని ట్రంప్ పదేపదే చెప్పుకుంటుండగా, భారత్ ఆ వాదనలను నిర్ద్వంద్వంగా ఖండిస్తూ వస్తోంది. తమ రెండు దేశాలు ద్వైపాక్షికంగానే ఈ విషయాన్ని పరిష్కరించుకున్నాయి, తప్ప ట్రంప్ ప్రమేయం లేదని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ నేతలు ట్రంప్ జోక్యాన్ని ప్రశంసిస్తూ వ్యాఖ్యలు చేయడం విశేషం. ఇస్లామాబాద్‌లోని అమెరికన్ ఎంబసీలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని షరీఫ్ ఈ వ్యాఖ్యలుచేయగా, పిపిపి చీఫ్ బిల్వాల్ భుట్టో జర్దారి వాషింగ్టన్‌లో అమెరికాలోని పాక్ జర్నలిస్టులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ శాంతి కాముకుడని షరీఫ్ వ్యాఖ్యానించారు.

మళ్లీ పేలిన తూటా

- మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మృతి
- నేషనల్ పార్క్ అడవుల్లో ఎదురు కాల్పులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో/ ఏలూరు ప్రతినిధి. స్పోర్ట్స్

మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కేశవరావు మృతి మరిచిపోకముందే ఇప్పుడు సుధాకర్ మృతి చెందడం.. మావోయిస్టులకు పెద్ద దెబ్బని పలువురు విశ్లేషిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో భద్రతా దళాలు మావోయిస్టుల మధ్య గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు (సిసిఎం) గౌతమ్ అలియాస్ సుధాకర్ మృతి చెందినట్టు బీజాపూర్ ఎస్‌పి జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. ఈ ఆపరేషన్ కోసం ఎస్‌టిఎఫ్, డిఆర్‌జి కోబ్రాకు చెందిన భద్రతా బలగాలు భారీగా కూంబింగ్ చేపట్టాయని చెప్పారు. ఎకె-47 రైఫిల్‌తోపాటు పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు బస్తర్ పరిధిలో 403 మంది మావోయిస్టు కేడర్ల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. మరికొందరు సాయుధ మావోయిస్టులు ఈ ప్రాంతంలో ఉన్నారన్న సమాచారంతో సెర్చ్ అపరేషన్‌ను పోలీసులు కొనసాగిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. కేంద్ర కమిటీ సభ్యులుగా, విప్లవాత్మక రాజకీయ పాఠశాలకు ఇన్‌చార్జిగా, సెంట్రల్ రీజినల్ బ్యూరోలో సుధాకర్ పని చేశారు.



40 ఏళ్ల క్రితమే మావోయిస్టు పార్టీలో చేరిక
స్వగ్రామం పెదపాడు మండలం సత్యవోలు

సుధాకర్ (65) స్వస్థలం ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు. ఆయన తండ్రి పేరు రామకృష్ణనాయుడు. స్వగ్రామం సత్యవోలులో ప్రస్తుతం సుధాకర్ సోదరుడు మాత్రమే ఉన్నారు. సుధాకర్‌కు రెండేళ్ల వయసు ఉన్నప్పుడే ఆయన సోదరి స్వర్ణకుమారికి దత్తత ఇచ్చినట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం గ్రామానికి చెందిన వీరు సుధాకర్‌ను రెండో ఏటనే దత్తత తీసుకెళ్లారని, అప్పటి నుంచి సుధాకర్ స్వగ్రామానికి పెద్దగా రాలేదని తెలిసింది. 1983లో సత్యవోలు గ్రామంలో ఆయన తండ్రి రామకృష్ణనాయుడు మృతి చెందినప్పుడు అంత్యక్రియల్లో పాల్గొన్నట్లు సమాచారం. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మావోయిస్టులతో శాంతి చర్చల్లో సుధాకర్ పాల్గొన్నారు. సుధాకర్ భార్య పేరు కాకర్ల సునీత అని తెలుస్తోంది. ఆమె మావోయిస్టు పార్టీలో కీలకంగా ఉన్నట్లు సమాచారం. సుధాకర్‌పై రూ.కోటి రివార్డును ప్రభుత్వం ప్రకటించింది. సుధాకర్ మృతి వార్త స్వగ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఆర్‌సిబి, క్రికెట్ అసోసియేషన్లపై ఎఫ్‌ఐఆర్

అసహజ మరణాలుగా నివేదికలు

బెంగళూరు : బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాటకు సంబంధించి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి), కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డిఎన్‌ఎపై కర్ణాటక పోలీసులు గురువారం ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 105, 125(1), (2), 132, 121-1, 190 కింద కేసు నమోదు చేసి, నేరపూరితమైన నిర్లక్ష్యం, నేరపూరితమైన హత్య సహా పలు తీవ్రమైన అభియోగాలను మోపారు. ఎకె గిరీష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కబ్బన్‌పార్క్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ దాఖలైంది.

అసహజ మరణాలుగా నివేదికలు

తొక్కిసలాటకు సంబంధించి బెంగళూరు నగర పోలీసులు ఎలాంటి ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేయ లేదు. అందుకు బదులుగా విడివిడిగా అసహజ మరణాలుగా పేర్కొంటూ 11 యుడిఆర్ (అసహజ మృతి నివేదిక)లను దాఖలు చేశారు. ఎఫ్‌ఐఆర్ నమోదైతే 24గంటల్లోగా దాన్ని సంబంధిత న్యాయస్థానానికి తెలియచేయాల్సి వుంటుంది. ఆ కేసులోని తదుపరి పరిణామాలన్నింటినీ ఎప్పటికప్పుడు కోర్టుకు వివరించాల్సి వుంటుంది. అదే అసహజ మృతి నివేదిక కేసులో అయితే ఎలాంటి క్రిమినల్ దర్యాప్తు వుండదు, ఆ పరిధిలోని తహసీల్దార్ ఆ దర్యాప్తును చూసుకుంటారు.



ఫస్ట్ ఎయిడ్ కూడా అందలేదు...

ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడానికి ముందుగా తాము దాదాపుగా నాలుగు గంటలు వేచి వుండాల్సి వచ్చిందని ఈ తొక్కిసలాటలో మరణించిన 15ఏళ్ల బాలిక దివ్యాన్షి కుటుంబం తెలిపింది. అధికారులు వచ్చారు, చూశారు, వెళ్లారు, కానీ సరైన సాయం అందించలేదు. చివరకు సరిగ్గా ప్రాథమిక చికిత్స కూడా అందలేదని బాలిక తండ్రి వాపోయారు. పోలీసుల నుండి ఎలాంటి సాయం లేకుండానే తన కూతురిని ఆటోలో తీసుకెళ్లాల్సి వచ్చిందని చెప్పారు.

కనీస ఏర్పాట్లు లేకుండా ఎలా నిర్వహిస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

ఘటనపై చేపట్టిన చర్యలను, ప్రభుత్వానికి సంబంధించిన వివరాలను కోర్టుకు అడ్వకేట్ జనరల్ వివరించారు. భద్రతాపరంగా అన్ని పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. దాదాపు రెండున్నర లక్షలకు పైగా వచ్చిన జనాలను నియంత్రించడంలో విఫలమయ్యామని ప్రభుత్వం అంగీకరించింది. తొక్కిసలాట ఘటనపై విచారణకు ఆదేశించామని, 15 రోజుల్లోగా కోర్టుకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఈ దర్యాప్తును సిఐడికి అప్పగించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. దర్యాప్తు కూలంకషంగా, స్వతంత్రంగా జరిగేందుకు వీలుగా సిఐడిలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తామని తెలిపింది. బెంగళూరు పోలీసు కమిషనర్, ఇతర కీలకమైన అధికారులను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆర్‌సిబి, క్రికెట్ అసోసియేషన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.

మోడీ మెప్పు కోసమే

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి సత్యకుమార్ ప్రకటించడం దారుణమని శ్రీనివాస రావు అన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేట్ కు అప్ప గించడమంటే, పేద, మధ్యతరగతి వర్గాలకు వైద్య విద్యను దూరం చేయడమేనని చెప్పారు. ఇప్పటికే ఆయా మెడికల్ కాలేజీల కోసం భారీగా భూములు సేకరించారని, కోట్ల రూపాయ లు ఖర్చు చేశారని, ఇప్పుడు ఆ భూములు, సౌకర్యాలు ప్రైవేట్ సొత్తు అవుతాయని విమర్శిం చారు. మెడికల్ సీట్లను కోట్లకు అమ్ముకుంటారని, దీనివల్ల పేద వర్గాలకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతుందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ప్రైవే టీకరణ విధానాలు ఆపేసి, 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలని అన్నారు. తద్వారా వైద్య విద్యను, వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయాలన్నారు.

ఆపరేషన్ కగార్ ఆపండి

అలాగే ఆపరేషన్ కగార్ ను వెంటనే ఆపాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. తద్వారా ఆంధ్రప్రదేశ్-ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్-ఛత్తీస్ గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకుంటుందని, గిరిజన ప్రాంతాల్లో భయోత్పాతం పోతుందని తెలిపారు.

బొమ్మల కొలువు





బి.గీతిక,
2వ తరగతి,
నెల్లూరు.





బండారి మానస,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పోతారెడ్డిపేట,
సిద్దిపేట.



సింహం చిట్టెలుక



ఒక అడవిలో ఒక సింహం ఉంది. అక్కడే ఓ ఎలుక కూడా ఉంది. ఒక రోజు సింహం చెట్టు కింద హాయిగా పడుకుంది. అప్పుడు పక్కనే ఉన్న కన్నంలో నుంచి ఎలుక బయటికి వచ్చింది. అటూ ఇటూ పరుగెడుతూ సింహం తలకి తగిలింది. సింహానికి బాగా కోపం వచ్చింది. దాని పంజాతో ఎలుకని పట్టుకుంది. 'నేను ఈ అడవికి రాజుని. నేను నిద్రపోతుంటే నా నిద్రకి భంగం కలిగిస్తావా? నిన్ను ఏం చేస్తానో చూడు!' అని గర్జించింది. అప్పుడు ఎలుక భయంతో 'మృగరాజా! నన్ను క్షమించండి. ఈసారికి విడిచిపెట్టి ప్రాణాలను రక్షించండి. ఎప్పుడైనా మీకు ఉపకారం చేస్తాను' అంది. ఎలుక మాటలకి సింహం పగలబడి నవ్వింది. 'ఏంటీ వేలెడంత లేవు, నువ్వు నాకు సాయం చేస్తావా? నీ మాటలు నాకు భలే నవ్వు తెప్పించాయి. అందుకే నిన్ను వదిలిపెడుతున్నా. ఇంకెప్పుడూ ఇటువైపు రాకు' అని పంజాలోని ఎలుకని విడిచిపెట్టింది.

ఒక రోజు సింహం అడవిలో తిరుగుతుండగా వేటగాడు పన్నిన వలలో చిక్కుకుంది. ఎంత ప్రయత్నించినా వల నుండి బయటపడలేదు. అప్పుడే అటువైపు ఎలుక వచ్చింది. సింహాన్ని చూసింది. వెంటనే దాని పదునైన పళ్లతో వల తాళ్లు కొరికింది. బతుకుజీవుడా అనుకుంటూ సింహం వల నుండి తప్పించుకుంది. బయటకి వచ్చాక ఎలుక చేసిన సాయానికి కృతజ్ఞతలు చెప్పింది. 'నేను నిన్ను చులకన చేశాను. అయినా ఈరోజు నువ్వు నన్ను కాపాడావు. ఇక నుండి మనం స్నేహంగా ఉందాం' అని చెప్పి ఆ రోజు నుండి అవి రెండూ స్నేహంగా ఉన్నాయి.



- సిహెచ్.రిషిత, 8వ తరగతి
నారాయణ ఒలంపియాడ్ అండ్ ఇటెక్నో స్కూలు,
మార్కాపూర్.





ఎం.ఇషిత,
4వ తరగతి, కృష్ణలంక,
విజయవాడ.

విడిదికి సెలవు .. చిన్నారి మొదలు

నేస్తాలూ, ఈరోజుతో వేసవి విడిది శీర్షికను ముగిస్తున్నాం. రచనలు పంపిన అందరికీ ధన్యవాదాలు. ఇక మీరు కొత్త పుస్తకాలతో, కొత్త తరగతులతో బిజీ అయిపోతారు కదా.. ఇంతకు ముందులాగానే చిన్నారి శీర్షిక యథావిధిగా మిమ్మల్ని పలకరిస్తుంది. తీరుబడి వేళల్లో చదువుతూ, రచనలు పంపుతూ ఉండండి మరి!

- ఎడిటర్

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

జీవన సౌరభం
లక్ష్యం అవకాశం కాదు.. ఎదురు చూడాల్సింది కాదు.. ఎన్నుకోవాల్సింది.

ఆటంకాలను అధిగమించి ...



విజయం కంటే విజయం కోసం చేసే ప్రయత్నమే చాలా గొప్పది. దృఢ సంకల్పం, తరగని ఆత్మవిశ్వాసం, బలమైన కోరిక ఉన్నచోట విజయం తప్పక వచ్చి తీరుతుంది. ఈ మాటలకు ఆచరణరూపం శికినం మానస.

జట్టు క్రీడ వాలీబాల్‌లో ఆమె అద్భుతాలు సృష్టిస్తున్నారు. బంతిని పైకి ఎగరేసి వల మీదుగా అవతలి కోర్టులో పడేలా సర్వ్ చేయటంతో ఆమె సిద్ధ హస్తురాలు. అవతలి జట్టువారు పంపిన బంతిని కిందపడకుండా ఇవతలి కోర్టులోకి పంపేందుకు ఆమె అద్భుత ఆటతీరు ప్రదర్శిస్తారు. ప్రత్యర్థి జట్టు కోర్టులోకి బంతిని పంపి పాయింట్లు సాధించటానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తారు. బంతి కిందపడకుండా మిగతా సభ్యులకు పంపటం ద్వారా జట్టును విజేతగా నిలపటమే ఏకైక లక్ష్యంగా శ్రమిస్తుంటారు. జాతీయస్థాయి క్రీడాకారిణిగా నిలుస్తూ భారతదేశ కీర్తిప్రతిష్టను ఇనుమడింప జేయటంతో సికినం మానస సర్వశక్తులూ ఒడ్డుతున్నారు.

బాపట్ల జిల్లా నిజాంపట్నం మండల కేంద్రానికి చెందిన శికినం శేషయ్య, లక్ష్మి దంపతుల కుమార్తె మానస 2004, సెప్టెంబర్ 30న జన్మించారు. మత్స్యకార కుటుంబంలో ఆమె జన్మించారు. ప్రాథమిక విద్య స్థానిక వికాస్ స్కూలులోనూ, 6 నుంచి 10 వరకూ నిజాంపట్నంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివారు. ఆ తర్వాత ఇంటర్మీడియట్‌ని గుంటూరులోని జీవిఆర్ అండ్ ఎస్ కాలేజీలో పూర్తిచేశారు. ఆ తర్వాత బిఎ డిగ్రీని ఖాజీపాలెంలోని కెవిఆర్ అండ్ కెవిఆర్ అండ్ ఎంకెఆర్ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది పూర్తిచేశారు.

చిన్నప్పటి నుంచే ఆటల పట్ల ఆసక్తి

మానసకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఎంతో ఇష్టం. పల్లెటూరు వాతావరణంలో పుట్టినా, ఆటలు వద్దంటూ కుటుంబంలోని వారు, బంధువులు వంటి వారు వారించినా ఆమె ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ఆటల్లో రాణించటం ద్వారా దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని భావించారు. దానికి చిన్నప్పటి నుంచి 'ప్రయత్నమే విజయం' అనే విషయాన్ని పూర్తిగా నమ్మి లక్ష్యసాధన కోసం ఆత్మవిశ్వాసంతో కృషిచేస్తున్నారు. ఫలితంగా జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారిణిగా నిలిచారు. హైస్కూలుస్థాయిలో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో పోటీలు పాఠశాలలో ఆమె పాల్గొని ఓవరాల్ చాంపియన్‌గా నిలిచేవారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని చాలా బహుమతులను కైవసం చేసుకున్నారు. తొలుత హైస్కూలు ఆవరణలో కొందరు క్రీడాకారులు బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ ఇతర ఆటలు ఆడుతుండగా, తను విభిన్నంగా వాలీబాల్ క్రీడను నేర్చుకోవాలనే మక్కువతో బంతి పట్టారు. వాలీబాల్ గ్రౌండ్ ఏర్పాటుచేసుకుని కనీసం చెప్పులు లేకుండానే బంతిపట్టి ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఆ తర్వాత మరింత ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకున్నారు. చదువుతోపాటు ఆటల్లోనూ రాణిస్తూ ముందుకు సాగారు.

వాలీబాల్‌పై మక్కువతో...

జాతీయస్థాయి క్రీడల్లో రాణించేందుకు ఆమె వాలీబాల్‌ను ఎంచుకున్నారు. డిగ్రీ మూడేళ్లు ఈ క్రీడాపోటీలు ఎక్కడ జరిగినా కాలేజీ, యూనివర్సిటీ తరపున పాల్గొని జయకేతనం ఎగురవేసేవారు. ఆతర్వాత కళాశాల, యూనివర్సిటీ ప్రతినిధుల నుంచి మంచి ప్రోత్సాహం లభించింది. ఫలితంగా ఆమె ఆత్మవిశ్వాసంతో వాలీబాల్ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించారు.

ఆర్థిక ఇబ్బందులు

తల్లిదండ్రులు ఇద్దరూ చేపల వేటకు వెళ్తారు. వాటి ద్వారా వచ్చే ఆదాయంతోనే కుటుంబం గడిచేది. మానస అన్నయ్య ఒకరు వ్యవసాయ పనులు చేస్తుండగా, చిన్నన్నయ్య చదువు పూర్తయి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో మానస జాతీయ క్రీడాపోటీల్లో పాల్గొనటానికి ఆర్థిక ఇబ్బందులు బాగా ఏర్పడ్డాయి. కనీసం ఛార్జీలకు డబ్బులు లేని పరిస్థితుల్లో కొన్ని క్రీడాపోటీలకు వెళ్లలేని పరిస్థితుల్లో ఆమె ఉన్నారు. జాతీయ క్రీడాకారిణికి మరింత ప్రోత్సాహాన్ని ఇవ్వటమే కాకుండా ఆర్థిక సహాయం రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వస్తే ఆమె మరింతగా క్రీడల్లో రాణించటానికి అవకాశాలు ఉంటాయి. డిగ్రీ పూర్తయినందున క్రీడా కోటాలో ఉద్యోగం ఇస్తే మరింతగా వాలీబాల్ క్రీడపై కేంద్రీకరించి రాణిస్తానని ఆమె ధీమా వ్యక్తంచేస్తున్నారు.

దేశానికి పతకాలు తెస్తా ...

వాలీబాల్ క్రీడలో మరింత రాణించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నా. జట్టు విజయంలో విశేషంగా శ్రమిస్తున్నా. విండివిడ్యువల్ గోల్స్ అచీవ్‌మెంట్‌గా నిపుణత ప్రదర్శిస్తున్నా. జాతీయ, అంతర్జాతీయ, ప్రపంచస్థాయి పోటీల్లో భారతదేశానికి బహుమతులు తీసుకురావాలనే లక్ష్యంతో కృషిచేస్తున్నా. మాది పేద కుటుంబం. అందుకే నేను ఆటల్లో రాణించేందుకు, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడేందుకు క్రీడాకోటాలో ఉద్యోగ అవకాశం కల్పించాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతున్నా.

- శికినం మానస, జాతీయ వాలీబాల్ క్రీడాకారిణి

పొందిన పతకాలు

–పశ్చిమబెంగాల్ లక్ష జూనియర్ నేషనల్స్ –2020–21లో పాల్గొని టాప్ 8వ క్రీడాకారిణిగా నిలిచారు.

–మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో యూత్ నేషనల్స్ –2022 మే, డిసెంబర్‌లో ప్రాతినిధ్యం

–తిరుపతిలో జరిగిన సౌత్‌జోన్ యూనివర్శిటీ మీట్ –డిసెంబర్ 2023లో మూడోస్థానం

–ఒడిస్సా ఆలిండియా యూనివర్శిటీ స్పోర్ట్స్‌మీట్–జనవరి 2024లో నాలుగోస్థానం

–తమిళనాడు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీస్పోర్ట్స్–2024లో ద్వితీయస్థానం (జెపిఆర్ యూనివర్శిటీ నుంచి ప్రాతినిధ్యం)

–మధ్యప్రదేశ్‌లో ఆలిండియా యూనివర్శిటీ స్పోర్ట్స్–ఫిబ్రవరి 2025లో నాల్గోస్థానం

– డామన్ అండ్ దయ్యూలో ఖేలో ఇండియా జాతీయస్థాయి బీచ్ వాలీబాల్ –మే 19 నుంచి 24–2025–బ్రాంజ్‌మెడల్

–యడవల్లి శ్రీనివాసరావు

గ్రెటా నేతృత్వంలో గాజా చిన్నారుల కోసం కదిలిన మానవత

కటానియా (ఇటలీ): ఇజ్రాయిల్ అమానుష దాడుల్లో శవాల దిబ్బగా మారుతున్న గాజాలోని చిన్నారులకు కనీస మానవతా సాయం అందించడమే లక్ష్యంగా పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్ నేతత్వంలో 12 మంది అంతర్జాతీయ ఉద్యమకారులు నౌకా ప్రయాణాన్ని ప్రారంభించారు. దక్షిణ సిసిలీలోని కటానియా పోర్టు నుంచి రెండు రోజుల క్రితం ఈ నౌక గాజావైపు ప్రయాణాన్ని ప్రారంభించింది. 'ఫ్రీడమ్ ఫ్లోటిల్లా కోలిషన్' అనే అంతర్జాతీయ మానవ హక్కుల ఉద్యమ సంస్థ 'మాడ్లీన్' అనే నౌకపైన ఈ 'మానవతా' యాత్రను నిర్వహిస్తోంది. ఈ పడవలో శిశువుల కోసం పాలు, ఆహార పదార్థాలు, అత్యవసర వైద్య పరికరాలు, ఇతర జీవన అవసరాలు ఉన్నాయి. గాజాలో తీవ్రంగా ఉన్న ఆహార, వైద్య సంక్షోభాన్ని కొంత మేరకైనా పరిష్కరించడంతో పాటు. అక్కడ నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రపంచ ప్రజానీకం దృష్టికి తీసుకురావడం ఈ యాత్ర లక్ష్యం. ఈ నౌక గమ్యస్థానాన్ని చేరుకోవాలంటే ఇజ్రాయిల్ అత్యంత కఠినంగా అమలు చేస్తున్న ముట్టడిని ఛేదించాల్సి ఉంది. తాము ఎటువంటి పరిస్థితుల్లోనూ లక్ష్యాన్ని చేరుకుంటామని, వెనకడుగు వేసే ప్రసక్తే లేదని గ్రెటా ప్రకటించారు. గ్రెటాతో పాటు గేమ్ ఆఫ్ థ్రోన్స్ నటుడు లియమ్ కనింగ్హామ్, పాలస్తీనా మూలాలుగల ఫ్రాన్స్‌కు చెందిన యూరోపియన్ పార్లమెంటు సభ్యురాలు రీమా హస్సన్ వంటి ప్రముఖులు ఈ యాత్రలో భాగస్వాములుగా ఉన్నారు. ఈ పడవ గాజా తీరానికి చేరుకుంటుందా? మధ్యలో ఇజ్రాయిల్ అడ్డుకుంటుందా అన్నది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగామారింది.

సిద్ధంగా ఉన్నాం... ఇజ్రాయిల్

మానవతా సాయం అందించడానికి గ్రెటా నేతృత్వంలో అంతర్జాతీయ ఉద్యమకారులు కదలడంపై ఇజ్రాయిల్ స్పందించింది. 'మేం సిద్ధంగా ఉన్నాం... వాళ్లను రానీయండి' అని ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్స్ స్పోక్స్ పర్సన్ బ్రిగ్ జనరల్ ఎఫి డెఫ్రిన్ అన్నారు. 'ఈ తరహా మనుషులతో ఎలా వ్యవహరించాలో మాకు చాలా బాగా తెలుసు. కొన్ని సంవత్సరాల అనుభవం ఉంది. వీరితో కూడా అలాగే వ్యవహరిస్తాం' అని ఆయన అన్నారు. గతంలో ఇలాంటి సహాయ మిషన్‌లను ఇజ్రాయెల్ సముద్రంలోనే అడ్డుకున్న ఉదంతాలు చాలా ఉన్నాయి.





లోకేశ్‌తో అమీర్ ఫిక్స్

లోకేశ్ కనకరాజ్‌తో తాను ఓ సినిమా చేస్తున్నట్లు బాలీవుడ్ స్టార్ హీరో తాజాగా ప్రకటించారు. 'సితారే జమీన్ పర్' చిత్ర ప్రమోషన్స్‌లో అమీర్‌ఖాన్ బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా ఆయన ఓ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. అందులో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 'లోకేశ్ కనగరాజ్‌తో మీరు సినిమా చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అందులో నిజమెంత?' అని విలేకరి ప్రశ్నించగా.. 'అవును నిజమే.. మేమిద్దరం ఓ సినిమా చేస్తున్నాం. ప్రస్తుతం దాని పనుల్లోనే బిజీగా ఉన్నాం. సూపర్‌హీరో జానర్‌లో ఈ కథ ఉంటుంది. భారీ స్థాయిలో యాక్షన్ మూవీగా దీనిని తీర్చిదిద్దాలనుకుంటున్నాం. వచ్చే ఏడాది జూన్ తర్వాత దీనిని పట్టాలెక్కించాలనుకుంటున్నాం. ప్రస్తుతానికి ఈ ప్రాజెక్ట్ గురించి ఇంతకుమించి ఏమీ చెప్పలేను. రెండేళ్ల తర్వాత దీని గురించి చర్చించుకుందాం' అని ఆమిర్ బదులిచ్చారు.

కథాబలంతో హిట్ మూవీగా నిలుస్తుంది

'నేటి ద్రౌపది (రక్తాని చిందిస్తుంది) సినిమా ట్రైలర్ చూసిన తర్వాత హిట్ అవుతుందన్న నమ్మకం బలంగా కలిగ్గింది. మంచి కథాబలం ఉన్న సినిమాగా ట్రైలర్‌ను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. నేటి సామాజిక పరిస్థితులకు అద్దంపట్టేలా ఈ సినిమా నిర్మాణం జరిగినట్లుగా తెలుస్తోంది. ప్రేక్షకులు ఇలాంటి సినిమాలను ఆదరించాలని కోరుతున్నాం. ఖర్చుకు వెనుకాడకుండా రామోజీ ఫిలిం సిటీలోని అందమైన లొకేషన్స్‌లో సినిమా తీయబట్టి ఆ రిచ్‌నెస్ సినిమాలో కనిపిస్తుంది. ఇలాంటి సినిమాలకు అందరూ సపోర్టు చేయాలని కోరుతున్నాం. ఇండస్ట్రీలో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు లభించేది చిన్న సినిమాల వల్లనే. చిన్న సినిమాలను ప్రేక్షకులు ఆదరించినపుడే చిత్ర పరిశ్రమ పచ్చగా ఉంటుంది' అని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ట్రెజరర్ టి.రామసత్యనారాయణ, దర్శక, నిర్మాత సాయి వెంకట్, కథానాయకుడు కిరణ్, ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ జె.వి.మోహన్‌గౌడ్ అన్నారు. శ్రీ శ్రీ శ్రీ మహమ్మాయి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బొడ్డుపల్లి బ్రహ్మ ఆచార్య దర్శక, నిర్మాతగా రూపుదిద్దుకున్న సినిమా 'నేటి ద్రౌపది (రక్తాన్ని చిందిస్తుంది)' శుక్రవారం విడుదల కానుంది.

సినీ ఆర్టిస్టుల కోసం ఆహ్వానం

యువ దర్శకుడు షేక్ అఫ్జల్ మరో రెండు కొత్త సినిమా ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే 10 రూపీస్, 1000 వాలా సినిమాలతో టాలీవుడ్‌లో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'తరుణం' సినిమా త్వరలోనే ఓటీటీలో విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా మరో రెండు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టబోతున్నట్లుగా ఆయన ప్రకటించారు. ఇందులో నటించే నటీనటుల కోసం ఎంపిక ప్రక్రియను ప్రారంభించామని పేర్కొన్నారు. 24 క్రాఫ్ట్ విభాగాల్లో ప్రతిభ గలవారికి, నటనపై ఆసక్తి ఉన్న వారు అవుట్‌స్టాండింగ్ టాలెంట్9999 పేరుతో ఉన్న జిమెయిల్‌కు తమ ఫోటోలు, వీడియోలు పంపించాల్సిందిగా కోరారు. మిగతా వివరాలకు సెల్ : 8498914347లో తనను సంప్రదించాలని పేర్కొన్నారు.



ఇంగ్లండ్‌కు బయల్దేరిన టీమిండియా

- వోక్స్‌కు చోటు
- తొలి టెస్టుకు జట్టును ప్రకటించిన ఇసిబి



లండన్: ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు టీమిండియా ఆటగాళ్ల బృందం గురువారం బయల్దేరింది. కెప్టెన్ శుభ్‌మన్, కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు ఐపిఎల్‌లో ఆడిన క్రీడాకారులందరూ ఇంగ్లండ్‌కు పయనమయ్యారు. ఇక టీమిండియాతో జరిగే తొలి టెస్ట్‌కు ఇంగ్లండ్–వేల్స్ క్రికెట్‌బోర్డు(ఇసిబి) తమ జట్టును గురువారం ప్రకటించింది. 14మందితో కూడిన జట్టులో సీనియర్ పేసర్ క్రిస్ వోక్స్ తిరిగి చోటు దక్కించుకున్నాడు. 36ఏళ్ల వోక్స్ దీర్ఘకాలం విరామం అనంతరం తిరిగి ఇంగ్లండ్ జట్టుకు ఎంపిక కాగా.. ఇప్పటివరకు 57టెస్టుల్లో 181వికెట్లు పడగొట్టాడు. 2018లో భారతజట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లగా వోక్స్ బౌలింగ్‌లో చెలరేగి ఇంగ్లండ్ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. దీంతో ఇంగ్లండ్ జట్టు ఆ టెస్టను ఇన్నింగ్స్ 159పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇక ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా భారత్ ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌తోనే 2025–2027 డబ్ల్యుటిసి సిరీస్ ప్రారంభంకానుంది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా 18 మందితో భారత జట్టును ఎంపిక చేశారు. జూన్ 20 నుంచి లీడ్స్ వేదికగా తొలి టెస్టు ప్రారంభంకానుంది. ఈ మ్యాచ్ కోసం ఇంగ్లాండ్ బెన్‌స్టోక్స్ కెప్టెన్‌గా 14 మందితో జట్టును ప్రకటించింది. పేసర్ గాస్ అట్కిన్సన్ గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు.

తొలి టెస్టుకు ఇంగ్లండ్ జట్టు: స్టోక్స్, షోయబ్ బషీర్, బెథెల్, బ్రూక్, కార్స్, సామ్ కుక్, క్రాలీ, డకెట్, ఒవర్టన్, పోప్, రూట్, స్మిత్, జోష్ టంగ్, వోక్స్.

భారత జట్టు: శుభ్‌మన్(కెప్టెన్), పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్, జడేజా, జురెల్, సుందర్, శార్దూల్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్, కుల్దీప్.

షెడ్యూల్...

తొలి టెస్ట్	: జూన్ 20 – 24(లీడ్స్)
రెండో టెస్ట్	: జులై 2 – 6(ఎడ్జ్‌బాస్టన్)
మూడో టెస్ట్	: 10 – 14(లార్డ్స్)
నాల్గో టెస్ట్	: 23 – 27(మాంచెస్టర్)
ఐదో టెస్ట్	: 31 – ఆగస్ట్ 4(ఓవల్)

మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు పరిహారం: ఆర్‌సిబి

చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 11మంది కుటుంబాలకు ఆర్థిక సాయం చేసేందుకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సిబి) ఫ్రాంచైజీ యాజమాన్యం ముందుకొచ్చింది. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. ఈ మేరకు తన అధికారిక ఎక్స్‌లో పోస్టు చేసింది. అలాగే గాయపడ్డవారికి చికిత్స కోసం 'ఆర్‌సిబి కేర్స్' పేరిట నిధులు సేకరించాలని నిర్ణయించింది. 'తొక్కిసలాట వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాం. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నాం. మా అభిమానులందరూ క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నాం. అభిమానులు పెద్ద ఎత్తున రావడంతో ఇలాంటి దుర్ఘటన చోటు చేసుకుంది. మాకు ప్రతి ఒక్కరి క్షేమం ముఖ్యం. దీని గురించి తెలిసిన వెంటనే మా కార్యక్రమాలను రద్దు చేసుకున్నాం. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. మాకు మద్దతుగా నిలిచే వారికి ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాం. అందరూ సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నాం' అని ఆర్‌సిబి అందులో పేర్కొంది. కర్ణాటక ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఇప్పటికే రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఫైనల్‌కు సబలెంక, గాఫ్

- సెమీస్‌లో స్వైటెక్‌పై గెలుపు
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంక, అమెరికాకు చెందిన 2వ సీడ్ కోకా గాఫ్ ప్రవేశించారు. గురువారం జరిగిన తొలి సెమీఫైనల్లో సబలెంక 7–6(8–1), 4–6, 6–0తో 5వ సీడ్, పోలండ్‌కు చెందిన ఇగా స్వైటెక్‌ను చిత్తుచేయగా.. రెండో సెమీస్‌లో గాఫ్ 6–1, 6–2తో అన్‌సీడెడ్ బోయ్‌సన్(ఫ్రాన్స్)ను ఓడించింది. తొలి సెమీస్‌లో సబలెంక తొలి సెట్‌ను టైబ్రేక్‌లో చేజిక్కించుకోగా.. రెండో సెట్‌ను 4–6తో చేజార్చుకుంది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో ఏకపక్షంగా ప్రత్యర్థికి ఒక్క సెట్ పాయింట్ కూడా ఇవ్వకుండానే మ్యాచ్‌ను ముగించడం విశేషం. శనివారం జరిగే ఫైనల్లో 2వ సీడ్ కోకా గాఫ్–అన్‌సీడెడ్ బోయ్‌సన్‌ల మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో టైటిల్‌కై తలపడనుంది. కెరీర్‌లో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్‌కు చేరుకోగా.. టాప్ ఫామ్‌లో కొనసాగుతున్న సబలెంక ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లోకి దూసుకెళ్లింది.

జకోవిచ్ జోరు

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ సెమీఫైనల్లోకి సెర్బియాకు చెందిన 6వ సీడ్, అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత నొవాక్ జకోవిచ్ ప్రవేశించాడు. గురువారం జరిగిన చివరి క్వార్టర్‌ఫైనల్లో జకోవిచ్ 4–6, 6–3, 6–2, 6–4తో 3వ సీడ్, జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరేవ్‌ను చిత్తుచేశారు. తొలి సెట్‌ను కోల్పోయిన అనంతరం జకోవిచ్ అద్భుతంగా పుంజుకొని టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు. దీంతో 38ఏళ్ల అత్యధిక వయసులో ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనల్‌కు చేరిన వారిలో ఒకడిగా అరుదైన ఘనత సాధించాడు. 1968 రొలాండ్ గారోస్‌లో పాంచో గోంజెల్స్ 40 ఏళ్ల వయసులో సెమీస్‌కు చేరాడు. ఆ తర్వాత ఈ ఫీట్ నమోదు చేసిన రెండో ప్లేయర్‌గా జొకోవిచ్ ఉన్నాడు. ఈ గెలుపుతో ఫ్రెంచ్ ఓపెన్‌లో 100 విజయాలు జకోవిచ్ పూర్తి చేసుకున్నాడు.

క్వార్టర్స్‌కు సాత్విక్-చిరాగ్ శెట్టి

- సింగిల్స్‌లో ఓడిన సింధు
- ఇండోనేషియా ఓపెన్

జకర్తా: ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. సింగిల్స్ విభాగంలో భారత షట్లర్ల పోరాటం ముగియగా.. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జంట క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్ 16–21, 21–18, 22–20తో డెన్మార్క్‌ఉ చెందిన కిజియర్–సేగార్డ్‌ను చిత్తుచేశారు. ఇక మహిళల సింగిల్స్‌లో పివి సింధు మూడుసెట్ల హోరాహోరీ పోరులో ఛోఛువాంగ్(థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో సింధు 22–20, 10–21, 18–21తో పోరాడి ఓడింది. ఇక మహిళల డబుల్స్ ప్రి క్వార్టర్స్‌లో త్రీసా జోలీ–గాయత్రీ గోపీచంద్ జంట పోరాటం ముగిసింది. ప్రి క్వార్టర్స్‌లో గాయత్రి–త్రీసా 13–21, 22–24తో జపాన్‌కు చెందిన మాట్సుమోటో–ఫుకోషిమా చేతిలో ఓటమిపాలయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో కరుణాకరణ్–ఆదిత్య జంట వరుససెట్లలోనే ప్రి క్వార్టర్స్‌లో ఓటమిపాలైంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68